
దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ




కీ.శే. నారగాని దుర్గా సరోజినిదేవి గారు
మరణం : 25-06-2026

శ్రద్ధాంజలి


మీ మరణం మాకు తీరని లోటు..
మీరు మానుండి దూరమైననూ
మీజ్ఞాపకాలు మమ్ము వీడలేదు..
మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని
దేవుని ప్రార్థిస్తూ.. శోకతప్త
హృదయాలతో..
శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము..
మీ జ్ఞాపకాలతో ముందుకు సాగుతూ..
ఇట్లు : కుటుంబ సభ్యులు



| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 81 | ది. 28-6-2026 | ఆదివారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 81 | Date : 28-6-2026 | Sunday | Pages : 8 | Rs.1/- |


# కులాలు చూడొద్దు... అభివృద్ధి చూడండి... ఎన్డీఏకు సహకరించండి

- వెలిగొండ ప్రాజెక్టు పరిధి రైతులు, నిర్వాసితులతో సమావేశంలో సీఎం చంద్రబాబు
- 2,351 మంది నిర్వాసితులకు రూ.300 కోట్ల ఆర్ అండ్ ఆర్ నిధుల చెక్కును అందించిన ముఖ్యమంత్రి
- వెలిగొండ పనులను వేగంగా జరిపిస్తున్నారంటూ మంత్రి నిమ్మలకు సీఎం కితాబు





**మార్కాపురం,జూన్ 27 (వార్తాప్రభ) :** ప్రాజెక్టులకు భూములిచ్చి సహకరిస్తున్న రైతులు, నిర్వాసితులు ఆనందంగా ఉండేలా చూడడం ప్రభుత్వాల బాధ్యత అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని తాము పాలన చేపడుతున్నామని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని.. అలాగే వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తామని.. ఇందుకు తనది గ్యారెంటీ ఆంటూ ముఖ్యమంత్రి ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం మార్కాపురం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా గంటవానిపల్లెలో వెలిగొండ ప్రాజెక్టు పనుల్ని పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును అధికారులు సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా రైతులు, నిర్వాసితులతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి 2,351 మంది నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ నిమిత్తం రూ.300 కోట్ల విలువైన చెక్కును ముఖ్యమంత్రి అందించారు. ప్రాజెక్టు పరిధిలోని రైతులు, నిర్వాసితులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖాముఖి నిర్వహించారు. వెలిగొండ ప్రాజెక్టు చరిత్ర... మార్కాపురం జిల్లా అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..."ప్రాజెక్టుకు భూములివ్వడం అంటే త్యాగం చేసినట్టే. పూర్వీకుల నుంచి వచ్చిన భూములను ప్రాజెక్టు కోసం వదులుకున్నారు. వెలిగొండ ప్రాజెక్టు నాలుగు జిల్లాల తలరాతను మారుస్తుంది. ఈ ప్రాంతంలో ఫ్లోరైడ్ సమస్యలు ఉన్నాయి.. దీంతో ఇక్కడి స్థానికులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. మార్కాపురం ప్రాంతం అంటే కరవు ప్రాంతమని పేరు... ఈ ప్రాంతానికి కృష్ణా నీళ్లు వస్తాయని ఎవ్వరూ అనుకోలేదు. మార్కాపురం ప్రాంతానికి కృష్ణా నీళ్లిచ్చేందుకు ఎన్టీఆర్ 1985లోనే ఆలోచన చేశారు... దీని కోసం ఓ కమిటీని వేశారు. ఎన్టీఆర్ హయాంలోనే వెలిగొండ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. 1995లో ప్రకాశం జిల్లా పర్యటనకు ఎప్పుడు వచ్చినా వెలిగొండ ప్రాజెక్టు గురించే అడిగేవాళ్లు. వరద వస్తే.. ఆ జలాలను మళ్లిస్తే ఆ నీళ్లతో తాము జీవనం సాగిస్తామని ఇక్కడి రైతులు చెప్పేవారు. 1996లో వెలిగొండకు శంకుస్థాపన చేశాం. వెలిగొండ ప్రాజెక్టుకు ప్రస్తుత లెక్కల ప్రకారం రూ.10,580 కోట్లు ఖర్చు అవుతుంది. ఇప్పటి వరకు రూ.6,736 కోట్లు ఖర్చు చేశాం... ఇంకా రూ.3,844 కోట్లు ఖర్చు పెట్టాలి. రూ.1,932 కోట్లు తొలి విడతలో ఖర్చు పెట్టాలి... రూ.1906 కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉంది. 2024లో ప్రభుత్వం వచ్చాక రూ.759 కోట్లు ఖర్చు చేశాం... నిర్వాసితుల కోసం రూ.905 కోట్లు మంజూరు చేసి రూ.300 కోట్లు విడుదల చేశాం. ప్రస్తుతం బ్యాంకులకు శెలవులు ఉన్నందున మరో రెండు రోజుల్లో నిర్వాసితుల ఖాతాల్లో ఆర్ అండ్ ఆర్ డబ్బులు జమ అవుతాయి. ఆర్థికంగా ఇబ్బందులున్నాయి... అయినా వెలిగొండ సహా వివిధ ప్రాజెక్టులను ప్రాధాన్యతల వారీగా పూర్తి చేస్తున్నాం."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**వెలిగొండతో నాలుగు జిల్లా తలరాతలు మారతాయి...**

"ప్రాజెక్టు కోసం త్యాగాలు చేసిన రైతులు, నిర్వాసితుల జీవితాలు మెరుగ్గా ఉంటాయి. 2,351 మంది నిర్వాసితులకు రూ.300 కోట్లు జమ చేస్తున్నాం. కలనూతల, సుంకేశుల, చింతలముడిపి, బుడుంచెర్ల, కాటంరాజు తండా, సాయిరాం నగర్, మెట్టి గొంది, బసవాయిపల్లి, లక్ష్మీపురం, అక్కచెరువు, గొట్టిపాడు గ్రామాల నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ నిధులు ఇస్తున్నాం. కొత్తగా నిర్మించబోయే కలెక్టరేట్ పక్కన కొన్ని గ్రామాల నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తున్నాం. కొత్త జిల్లా ఏర్పాటు చేయడంతోపాటు.. నిర్వాసితుల కాలనీలో కలెక్టరేట్ ఏర్పాటు చేస్తున్నాం... నిర్వాసితుల కాలనీల్లో మౌళిక సదుపాయాలు పూర్తి చేశాం. నిర్వాసితుల త్యాగం వల్ల 4.47 లక్షల ఎకరాలకు నీళ్లు అందుతాయి. 23 లక్షల మందికి తాగునీరు లభిస్తాయి. వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-1 ద్వారా ఈ సీజన్ లో నీళ్లను అందిస్తాం. ఫేజ్-1 కింద 1.19 లక్షల ఎకరాలకు నీళ్లు, 4 లక్షల మందికి తాగునీరు అందిస్తాం. ఫేజ్-2 కింద 3.25 లక్షల ఎకరాలకు సాగునీరు, 11.25 లక్షల మందికి తాగునీరు అందుతుంది. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం ఓ చరిత్ర. ఈ ప్రాజెక్టు లబ్దిదారులతోపాటు.. నిర్వాసితులు కూడా ఆనందంగా ఉండేలా చూడడం ప్రభుత్వాల ప్రధాన బాధ్యత. హైదరాబాద్ నగరంలో తెచ్చిన ప్రాజెక్టుల వల్ల నిర్వాసితులు కోట్లాది రూపాయలు గడించారు. అభివృద్ధి చేస్తేనే ఆదాయం వస్తుంది.. వెలిగొండ ప్రాజెక్టు వల్ల నాలుగు జిల్లాల పరిధిలో భూముల ధరలు పెరుగుతాయి... ఆ జిల్లాల తలరాతలు మారతాయి. కరవు జిల్లా పరిస్థితులను అర్థం చేసుకునే కలెక్టరును మార్కాపురానికి నియమించాం. మార్కాపురం జిల్లాలో హార్టికల్చర్ పంటలు వేయాలి. పూర్వోదయ ప్రాజెక్టులో మార్కాపురం జిల్లాను కూడా చేర్చాం. అగ్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా రైతులకు ఆదాయం పెరుగుతుంది.. యువతకు ఉపాధి కల్పిస్తాం. రామాయపట్నం పోర్టు మార్కాపురానికి సమీపంలో ఉంది.. ఎగుమతులకు అనుకూలంగా ఉంటుంది. ఈ ప్రాంతానికి కనెక్టివిటీ పెంచుతాం. మంత్రి నిమ్మల రామానాయుడు వెలిగొండ ప్రాజెక్టు వద్దే ఉంటున్నారు. టన్నెల్లోకి వెళ్తున్నారు.. పుట్టిన రోజు కూడా ఇక్కడే జరుపుకున్నారు. వెలిగొండ ప్రాజెక్టు

- 8లో

# ప్రతీ ఒక్కరి ఆరోగ్యం కోసమే సంజీవని

- టెక్నాలజీ వినియోగంలో నేను జెన్ జీ వర్గమే
- నదుల అనుసంధానమే రాష్ట్రాలకు శ్రీరామ రక్ష
- కాలర్ ఎగరేసి చెప్పుకునేలా అమరావతి నిర్మాణం
- నిర్మాణాల వేగం చూసి తట్టుకోలేకే రాజధానికి వైసీపీ నేతలు ఛీ ఛీ అంటున్నా... మావిగన్ పట్టుకుని వేలాడుతున్నారు.
- వైసీపీ క్రిమినల్ పాలిటిక్స్ తో సమాజానికి, ఆడబిడ్డలకు రక్షణ లేదు
- గిద్దలూరు కిష్టంశెట్టి పల్లెలో సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్ ప్రారంభించిన సీఎం చంద్రబాబు





**మార్కాపురం జిల్లా, జూన్ 27 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో ప్రతీ ఒక్కరి ఆరోగ్యం కోసమే సంజీవని ప్రాజెక్టు అమలు చేయాలని నిర్ణయించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్రంలో ప్రతీ ఒక్కరి డిజిటల్ హెల్త్ రికార్డులతో కూడిన సంజీవని ప్రాజెక్టును అమలు చేయనున్నట్టు వెల్లడించారు. మార్కాపురం జిల్లా గిద్దలూరు నియోజకవర్గం కిష్టంశెట్టి పల్లెలో సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్ ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి జిల్లా ఆస్పత్రి, సూపర్ స్పెషాలిటీ కేర్ వరకూ వైద్య సేవలు అందేలా ఈ సంజీవని డిజిటల్ హెల్త్ రికార్డుల ద్వారా వ్యక్తిగత ఆరోగ్య పర్యవేక్షణ ఉంటుందని సీఎం వివరించారు. ప్రజలు అందరికీ సంపూర్ణ వైద్య సేవలు అందించేలా సంజీవని కార్యక్రమం అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరెటివ్ విధానం ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడతామని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి సూపర్ స్పెషాలిటీ వం-కూ మొత్తం ఆరోగ్య వ్యవస్థను ఒకే డిజిటల్ వేదికపై అనుసంధానిస్తామని అన్నారు.

# కిషన్ రెడ్డి, రామ్మోహన్ కు కొత్త శాఖలు

## తెలుగు రాష్ట్రాల నుంచి ఇన్.. అవుట్..!?



**న్యూఢిల్లీ, జూన్ 27 (వార్తాప్రభ) :** కేంద్ర కేబినెట్ ప్రక్షాళనకు రంగం సిద్ధం అవుతోంది. ఇప్పటికే మంత్రుల మార్పులు.. చేర్పుల పైన సుదీర్ఘ కసరత్తు చేసారు. కొందరు సీనియర్లకు పార్టీ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయం తీసుకున్నారు. యువ నేతలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రుల విషయంలోనూ మార్పులు ఖాయంగా కనిపిస్తోంది. శాఖలు మారటంతో పాటుగా కొత్తగా ఇద్దరికి అవకాశం దక్కుతుందని తెలుస్తోంది. ప్రధాని మోదీ తన కేబినెట్ ను పూర్తి స్థాయిలో ప్రక్షాళనకు నిర్ణయించారు. దీంతో, కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై ఉత్కంఠ కొనసాగుతోంది. మంత్రివర్గం లోకి ఆర్బీఐ మాజీ గవర్నర్, ప్రధాని ముఖ్య కార్యదర్శి శక్తి కాంత దాస్‌కు మంత్రివర్గంలో స్థానం దక్కే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శాఖ మారుస్తారని చెబుతున్నారు. ఆమెకు విద్యాశాఖ కేటాయించనున్నట్లు సమాచారం. విద్యాశాఖ చూస్తున్న ధర్మేంద్ర ప్రధాన్ ను కేబినెట్ నుంచి తప్పించటం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్‌ను మళ్లీ మంత్రివర్గంలోకి తీసుకుంటారు. ఇదే సమయంలో ఏపీ, తెలంగాణ నుంచి కేబినెట్ మంత్రులుగా ఉన్న కిషన్ రెడ్డి, రామ్మోహన్ నాయుడు శాఖలు మారనున్నాయి. కిషన్ రెడ్డికి గతంలో జైపాల్ రెడ్డి నిర్వహించిన పట్టణాభివృద్ధి శాఖ కేటాయిస్తున్నట్లు సమాచారం.అదే విధంగా రామ్మోహన్ నాయుడును విమానయాన శాఖ తప్పించి మరో శాఖ ఇచ్చే విధంగా కసరత్తు జరుగుతోందని తెలుస్తోంది. ఇక.. తెలంగాణ నుంచి రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ కు మంత్రి పదవి దక్కే అవకాశం ఉందని తెలుస్తోంది. బండి సంజయ్ మంత్రి పదవి పైన చర్చ సాగుతున్నా..ఆయన కొనసాగటం దాదాపు ఖాయమైంది. ఇక.. ఏపీ నుంచి మంత్రి పెమ్మసానికి ప్రమోషన్ దక్కనుందని తెలుస్తోంది. కొత్తగా మరో మంత్రి కేబినెట్ లో అవకాశం కల్పించారు. జనసేన కు మంత్రి పదవి ఇవ్వాలని బీజేపీ నాయకత్వం ఆలోచన చేస్తోంది. జనసేన ముందుకు రాకుంటే టీడీపీ నుంచి ఎస్సీ వర్గానికి చెందిన ఇద్దరు ఎంపీలు, బీజేపీ నుంచి సీఎం రమేశ్ పేర్ల పైన చర్చ జరుగుతున్నట్లు సమాచారం. కాగా.. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని చెబుతున్నారు.


**మహారాజశ్రీ మొదటి ఎడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు విజయవాడ**

**OS.NO. 2031/2025**

Between:
Bank of Baroda, 1 Town Branch, Vijayawada
Rep by its Chief Manager ....... Plaintiff
AND
Duda Ram Dewasi ..... Defendant
To.
Duda Ram Dewasi, Door No. 11-29-20, 2nd Line, Avula Vari Street, Near Srinu Hotel, One Town, Vijayawada-520001.

పై నెంబరు గల దావాలో ప్రతివాది అయిన మీకు నోటీసు నిమిత్తం **ది.30-07-2026** వ తేదిన పై కోర్టు వారు వాయిదా వేసినారు కావున సదరు తేదిన మీరు గాని మీ తరపున ప్లీడరు గారు గాని పైన తెలిపిన కోర్టు వారి ముందు **ది.30-07-2026 వ తేది ఉదయం 10.30 ని.లకు** పై కోర్టులో హాజరై తగిన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున పై నెంబరు దావాలో విచారించగలరని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(By Order of the Hon'ble Court)

ఇట్లు
**యం.డి ప్రభాకర్, M.Com, LL.M.,** న్యాయవాది,
డి.నెం.31-16-30, బుల్లెమ్మ వీధి, మాచవరం,
విజయవాడ-520004. ఫోన్: **9290055959**
email: advdurgaprabhakar@gmail.com



**మహారాజశ్రీ మొదటి ఎడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు విజయవాడ**

**OS.NO. 1568/2025**

Between:
Union Bank of India, Krishnalanka Branch, Vijayawada
Rep by its Branch Manager ....... Plaintiff
AND
Chennuri Deepthi Rani ..... Defendant
To.
Deepthi Rani Chennuri, W/o. Bharat Ram, SF-4, 2nd floor, Bhavani Towers, Swathi Theater Road, Bhavanipuram, Vijayawada-520012.

పై నెంబరు గల దావాలో ప్రతివాది అయిన మీకు నోటీసు నిమిత్తం **ది.09-09-2026** వ తేదిన పై కోర్టు వారు వాయిదా వేసినారు కావున సదరు తేదిన మీరు గాని మీ తరపున ప్లీడరు గారు గాని పైన తెలిపిన కోర్టు వారి ముందు **ది.09-09-2026 వ తేది ఉదయం 10.30 ని.లకు** పై కోర్టులో హాజరై తగిన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున పై నెంబరు దావాలో విచారించగలరని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(By Order of the Hon'ble Court)

ఇట్లు
**యం.డి ప్రభాకర్, M.Com, LL.M.,** న్యాయవాది,
డి.నెం.31-16-30, బుల్లెమ్మ వీధి, మాచవరం,
విజయవాడ-520004. ఫోన్: **9290055959**
email: advdurgaprabhakar@gmail.com



**మహారాజశ్రీ మొదటి ఎడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు విజయవాడ**

**OS.NO. 703/2024**

Between:
Union Bank of India, Seetharampuram Branch, Vijayawada
Rep by its Branch Manager ....... Plaintiff
AND
SRUNGARAKAVI SUJATHA,
Prop: M/s Padmavathi Labour Works ..... Defendant
To.
SRUNGARAKAVI SUJATHA, W/o. Subrahmanyam Mandivada, D.No. 54-14/1-15, Road No.10, Novotel Road, Bharathinagar, Patamata, VIJAYAWADA-520008.

పై నెంబరు గల దావాలో ప్రతివాది అయిన మీకు నోటీసు నిమిత్తం **ది.05-08-2026** వ తేదిన పై కోర్టు వారు వాయిదా వేసినారు కావున సదరు తేదిన మీరు గాని మీ తరపున ప్లీడరు గారు గాని పైన తెలిపిన కోర్టు వారి ముందు **ది.05-08-2026 వ తేది ఉదయం 10.30 ని.లకు** పై కోర్టులో హాజరై తగిన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున పై నెంబరు దావాలో విచారించగలరని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(By Order of the Hon'ble Court)

ఇట్లు
**యం.డి ప్రభాకర్, M.Com, LL.M.,** న్యాయవాది,
డి.నెం.31-16-30, బుల్లెమ్మ వీధి, మాచవరం,
విజయవాడ-520004. ఫోన్: **9290055959**
email: advdurgaprabhakar@gmail.com


# లలిత జ్యువెలర్స్ కిరణ్ కు ఏమైంది.. ఎందుకిలా..



**విజయవాడ,జూన్ 27 (వార్తాప్రభ) :** డబ్బు ఎవరికీ ఊరికే రాదు. మా సంస్థకు ఒకసారి రండి. ఇతర సంస్థలకు ఒకసారి వెళ్లండి. ధరలు పోల్చి చూసుకోండి. ఒకే ఒక ఈ ప్రకటనతో బంగారం వ్యాపారాన్ని మొత్తం పూర్తిగా మార్చేశాడు కిరణ్. పోటీ సంస్థలు సెలబ్రిటీలతో ప్రకటనలు రూపొందిస్తుంటే.. ఇతడు మాత్రం తనకు తానే ప్రచారం చేసుకున్నాడు. ఫలితంగా మీడియాలో ట్రెండ్ సెట్టర్ అయ్యాడు. గోల్డ్ బిజినెస్ లో తమిళనాడు.. మలయాళం వ్యాపారులు ఎప్పటినుంచో కింగ్ మేకర్లుగా ఉన్నారు. అయితే వారిని అధిగమించాడు కిరణ్. లలిత జ్యువెలర్స్ పేరుతో సంస్థ ఏర్పాటు చేసి అనేక శాఖలు ఏర్పాటు చేశాడు. లలిత జ్యువెలర్స్ సంస్థకు రెండు తెలుగు రాష్ట్రాలు మాత్రమే కాకుండా.. తమిళనాడు.. కేరళ వంటి ప్రాంతాలలో శాఖలు ఉన్నాయి. వీటిల్లో భారీగానే వ్యాపారం జరుగుతూ ఉంటుంది. పైగా సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటాడు గుండు కిరణ్. ఎప్పటికప్పుడు తన వ్యాపారం గురించి.. తన సంస్థ ఆధ్వర్యంలో రూపొందిస్తున్న బంగారు ఆభరణాల గురించి ప్రత్యేకమైన వీడియోలు రూపొందిస్తూ.. వీక్షకులతో పంచుకుంటాడు. ఇటీవల కాలంలో కిరణ్ కుమార్ తన వ్యవహార శైలిని పూర్తిగా మార్చుకున్నాడు. వ్యాపారంతో పాటు విహారయాత్రలకు ప్రాధాన్యమిస్తున్నాడు. వాటిని వీడియోలుగా రూపొందించి ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నాడు. తాజాగా తన స్నేహితులతో కలిసి అతడు ఓ ప్రాంతానికి వెళ్ళాడు. అక్కడ కుర్మా తయారు చేశాడు. చపాతీలు కూడా తయారు చేశాడు. తన స్నేహితులకు వడ్డించాడు. పైగా ఇలా కూర్మ చేసుకుని తింటే.. అందులో చపాతీలను కలుపుకొని తింటే ఎంతో బాగుంటుందని చెప్పుకొచ్చాడు. ఈ వీడియో చాలా మందిని ఆకట్టుకుంది. అంతేకాదు గుండు కిరణ్ కుమార్ లో ఈ టాలెంట్ కూడా ఉందని నిరూపించింది. ఎంతైనా కిరణ్ కుమార్ రేంజ్ వేరు. ఎందుకంటే అతడు వ్యాపారం చేయగలడు.. వంట కూడా చేయగలడు..


**CHANGE OF NAME**

I, **PRATHIPATI PAPA, D/o. Kutumbarao (Old Name)**, R/o. # 3-57, Chithapur, Patamata Harijanawada, Chittapur, Krishna District-521213, A.P., India. I have changed my name as **PRATHIPATI SNEHA, D/o. PRATHIPATI KUTUMBARAO (New Name)**. Hereafter my name is known as **PRATHIPATI SNEHA, D/o. PRATHIPATI KUTUMBARAO (New Name).**



**CHANGE OF NAME**

I, **PARASARAM CHANDANA KRISHNA GAYATHRI, D/o. Parasaram Vijay Kumar (Old Name)**, R/o. # 1-55, Gandhi Bomma Center, Near Venugopala Swamy Temple, OC, BC Area, Polampalle, Vatsavai Mandal, Krishna District-521402, A.P., India. I have changed my name as **CHANDANA PARASARAM, D/o. VIJAYAKUMAR PARASARAM (New Name)**. Hereafter my name is known as **CHANDANA PARASARAM, D/o. VIJAYAKUMAR PARASARAM (New Name).**



**CHANGE OF NAME**

I, **PARASARAM SRI PAADA ANANTHA KRISHNA SARMA, S/o. Vijay Kumar (Old Name)**, R/o. # 1-55, Near Venugopala Swamy Temple, Polampalle, Vatsavai Mandal, Krishna District-521402, A.P., India. I have changed my name as **KRISHNA PARASARAM, S/o. VIJAYAKUMAR PARASARAM (New Name)**. Hereafter my name is known as **KRISHNA PARASARAM, S/o. VIJAYAKUMAR PARASARAM (New Name).**

## రైతు బజార్లో ఆక్రమణలపై కమిషనర్ మరోసారి తనిఖీ



**కాకినాడ,జూన్ 27 (వార్తాప్రభ) :** కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని రైతు బజారును నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ శనివారం మరోసారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. డ్రైనేజీలను ఆక్రమించకుండా, దుకాణాలను డ్రైనేజీల వెనుక భాగంలోనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎస్టేట్ అధికారిని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా, రైతు బజార్‌కు వచ్చే వినియోగదారుల కోసం ప్రత్యేక పార్కింగ్ సౌకర్యం కల్పించేందుకు అనువైన స్థలాన్ని కమిషనర్ పరిశీలించారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా రైతు బజార్ నిర్వహణ ఉండాలని, ఆక్రమణలను పూర్తిగా తొలగించి సక్రమమైన ప్రణాళికతో అభివృద్ధి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో టి పి ఎస్ రామ్మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వి చరణ్,, డి ఈ ప ఫణిచంద్ర, ఏ ఈ రత్నవలి ,శానిటేషన్ సూపర్వైజర్ నాయుడు, శానిటేషన్ ఇన్స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# మన ద్రాక్షారామం.. మన బాధ్యత.. ఇదే మంత్రి సుభాష్ సంకల్పం

● వారం రోజుల్లో నూతన మార్కెట్ షెడ్లు నిర్మాణం ● మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపుతో రూ.66 లక్షల విరాళాలు

● బాధితుల పునరావాసానికి వేగవంతమైన చర్యలు ● అగ్నిప్రమాద బాధితులను పరామర్శించిన కూటమి పార్టీ నాయకులు





**ద్రాక్షారామం,జూన్ 27 (వార్తాప్రభ) :** ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు ముందుండే నాయకుడు .. "మన ద్రాక్షారామం.. మన బాధ్యత" అనే లక్ష్యంతో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అగ్నిప్రమాద బాధితులకు అండగా నిలుస్తున్నారని కూటమి పార్టీ నాయకులు పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం అగ్నిప్రమాదంలో దగ్ధమైన ద్రాక్షారామం మార్కెట్ ప్రాంతాన్ని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ తదితరులు సందర్శించి బాధితులను పరామర్శించారు. బాధిత వ్యాపారులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పిన నాయకులు, ప్రమాదం జరిగిన తొలి క్షణం నుంచే మంత్రి వాసంశెట్టి సుభాష్ పరిస్థితిని అత్యంత సీరియస్‌గా తీసుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. మార్కెట్ ప్రాంతాన్ని వెంటనే శుభ్రపరిచి, వారం రోజుల్లో నూతన షెడ్లు నిర్మించి బాధితులకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి ప్రత్యేక ఆదేశాలు ఇచ్చారని వెల్లడించారు.

**మంత్రి పిలుపుతో రూ.66 లక్షల విరాళాలుకు హామీ..** మన ద్రాక్షారామం.. మన బాధ్యత అనే ఆశయంతో మార్కెట్‌కు మళ్లీ పూర్వ వైభవం తీసుకురావాలి అనే పిలుపునిచ్చిన మంత్రి సుభాష్ స్వయంగా రూ.20 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించి తన ప్రజలపై ఉన్న ప్రేమను చాటుకున్నారని నాయకులు పేర్కొన్నారు. అంతేకాకుండా తన పిలుపునకు స్పందించిన దాతలతో సమన్వయం చేసి సుమారు రూ.66 లక్షల విరాళాలు సమకూర్చే బాధ్యతను స్వయంగా తీసుకుని బాధిత కుటుంబాలకు అండగా నిలిచారని కొనియాడారు. సాటి మనుషులు ఆపదలో ఉన్నప్పుడు చేయూత అందించేందుకు ముందుకు వచ్చిన మంత్రి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్, ప్రతి దాతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారి సహకారంతో బాధిత వ్యాపారులు తిరిగి తమ జీవితాలను గాడిలో పెట్టుకునే అవకాశం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**మంత్రి సుభాష్ చేసిన సహాయం జీవితాంతం మరువలేం -- కన్నీటి పర్యంతమైన బాధితులు..** మార్కెట్‌ను సందర్శించిన కూటమి నాయకులతో మాట్లాడిన అగ్నిప్రమాద బాధితులు భావోద్వేగానికి గురయ్యారు. ప్రమాదం జరిగిన సమయం నుంచి ఇప్పటి వరకు ప్రతి క్షణం తమతోనే ఉండి, అన్ని విధాలుగా అండగా నిలిచిన మంత్రి సుభాష్ సేవా భావాన్ని జీవితాంతం మరచిపోలేమని అన్నారు. ఎంతోమంది రాజకీయ నాయకులను చూశాం.. కానీ ప్రమాదం జరిగిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని, బాధితుల కన్నీరు తుడిచి, పునరావాసం కోసం నిరంతరం శ్రమిస్తున్న మంత్రి సుభాష్ మానవత్వం, సేవా గుణం ఎప్పటికీ గుర్తుండిపోతుంది అంటూ పలువురు వర్తకులు కన్నీటి పర్యంతమయ్యారు.

**ప్రతి బాధితుడికి న్యాయం జరిగేలా మంత్రి కృషి..** ఈ సందర్భంగా కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ , జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ లు మాట్లాడుతూ తన నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలన్న భావన, కృత నిశ్చయంతో మంత్రి సుభాష్ నిరంతరం పనిచేస్తున్నారని అన్నారు. జిల్లా యంత్రాంగాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ, మార్కెట్‌ను అత్యవసరంగా పునరుద్ధరించి వ్యాపారులు తిరిగి తమ ఉపాధిని ప్రారంభించుకునేలా చర్యలు చేపట్టారని తెలిపారు. అగ్నిప్రమాదం జరిగిన తీరుపై సమగ్ర దర్యాప్తు నిర్వహించేందుకు గుంటూరు నుంచి ఉన్నతాధికారులు కూడా వస్తున్నారని, ప్రమాదానికి గల అసలు కారణాలను అన్ని కోణాల్లో విచారించి వెలికి తీస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఉండవెల్లి శివ, రామచంద్రపురం రూరల్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనుబాబు, ద్రాక్షారామం మాజీ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, కూటమి పార్టీ నాయకులు, వర్తక సంఘం ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సమిష్టి కృషితో విజయం సాధిద్దాం

### -మండల వైద్యాధికారి కే శ్రీనివాసరావు



**విస్సన్నపేట,జూన్ 27 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో జాతీయ టీకా దినోత్సవ కార్యక్రమాలు భాగంగా ఆదివారం 28వ తేదీ జరుగు పల్స్ పోలియో టీకా కార్యక్రమాన్ని సమిష్టి కృషితో విజయవంతం చేద్దామని మండల వైద్యాధికారి కే శ్రీనివాసరావు ర్యాలీ కార్యక్రమంలో తెలియజేశారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు బైవాలెంటు ఓరల్ పోలియో వ్యాక్సిన్ (బి ఓ పి వి ) యొక్క రెండు చుక్కలను వేయటం లక్ష్యంగా పెట్టుకుందని గతంలో సాధారణ పోలియో టికాలు తీసుకున్నప్పటికీ ప్రభుత్వ ఆసుపత్రులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అంగన్వాడీ కేంద్రాలు నిర్ణయించిన పాఠశాలలు బస్టాండ్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్థానిక పోలియో బూతులు ప్రతి ఒక్క బేబీకి అందేలా 45 కేంద్రాలలో అందుబాటులో ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిన్న రాట్నాలు, డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్, ఏవో ప్రసాద్, రీ సర్వే డి టి విజయభాస్కర్, ఈవో హరికృష్ణ కుమార్, హెల్త్ సూపర్వైజర్లు సత్యనారాయణ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## నూజివీడు ప్రొహిబిషన్ & ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం విక్రయాల నియంత్రణకు ఎక్సైజ్ శాఖ కఠిన చర్యలు



**నూజివీడు,జూన్ 27 (వార్తాప్రభ) :** నూజివీడు ప్రొహిబిషన్ & ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం విక్రయాలు, గొలుసు దుకాణాల నిర్వహణ, నిబంధనల ఉల్లంఘనలను అరికట్టడంతో పాటు ప్రజలకు చట్టబద్ధమైన, పారదర్శకమైన మద్యం విక్రయ వ్యవస్థను అందించేందుకు ఎక్సైజ్ శాఖ నిరంతరం ప్రత్యేక దాడులు, ఆకస్మిక తనిఖీలు, నిఘా చర్యలు చేపడుతోందని ప్రొహిబిషన్ & ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీ ఎ. మస్తానయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నూజివీడు స్టేషన్ పరిధిలో ఇప్పటివరకు 96 గొలుసు దుకాణాలపై కేసులు నమోదు చేసి, 96 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అలాగే 731 మద్యం బాటిళ్లను స్వాధీనం (సీజ్) చేసామని, ప్రజా శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా 75 మందిని సంబంధిత తహసీల్దార్ (ఎమ్మార్వో) ఎదుట బైండోవర్ చేసినట్లు వివరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి లైసెన్స్ పొందిన మద్యం దుకాణంలో పర్మిట్ రూమ్ నిర్వహణకు అనుమతి ఉందని, పర్మిట్ రూమ్‌లో మద్యం సేవించడం మాత్రమే చట్టబద్ధమని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టవిరుద్ధమని పేర్కొంటూ, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 09 మంది వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. అదేవిధంగా, ప్రతి మద్యం బాటిల్ విక్రయాన్ని AP Excise Suraksha App ద్వారా QR కోడ్ స్కాన్ చేసిన అనంతరమే వినియోగదారులకు విక్రయిస్తున్నామని తెలిపారు. ఈ విధానం ద్వారా ప్రతి విక్రయం డిజిటల్‌గా నమోదు కావడంతో పారదర్శకత పెరగడమే కాకుండా, అక్రమ మద్యం విక్రయాలను సమర్థవంతంగా నియంత్రించడం జరుగుతోందన్నారు. అక్రమ మద్యం విక్రయాలు, గొలుసు దుకాణాల నిర్వహణ, అధిక ధరలకు విక్రయాలు, నిబంధనల ఉల్లంఘనలు మరియు ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై జీరో టాలరెన్స్ విధానంతో ఎక్సైజ్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటోందని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. అక్రమ మద్యం విక్రయాలు, అధిక ధరలకు విక్రయాలు లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప ప్రొహిబిషన్ & ఎక్సైజ్ స్టేషన్ లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. ప్రజల సహకారంతో అక్రమ మద్యం నిర్మూలన, చట్టబద్ధమైన మద్యం విక్రయాల పర్యవేక్షణ మరియు వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణకు ఎక్సైజ్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ప్రొహిబిషన్ & ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీ ఎ. మస్తానయ్య తెలిపారు.

## బంటుమిల్లి శాంతినగర్ లో ఘోర రోడ్డు ప్రమాదం......

● ద్విచక్ర వాహనాన్ని డికోట్టిన కారు......
యువకుడు మృతి.... మరొకరికి గాయాలు

● మానవత్వం చాటిన పెడన ఎమ్మెల్యే.......



**కృత్తివెన్ను,జూన్ 27 (వార్తాప్రభ) :** మండలంలోని అర్తమూరు పంచాయతీ శివారు శాంతినగర్ లో శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం బంటుమిల్లి నుంచి వేర్వేరు బైకుల పై వెళుతున్న ఇరువురు వ్యక్తులను మచిలీపట్నం నుంచి వస్తున్న కారు డికోట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు పెడనకు చెందిన అబ్దుల్ హాపిద్ వయస్సు 19 సంవత్సరాలు స్వల్ప గాయాలు పాలయిన బాసినపాడు గ్రామస్తుడు కట్టా నాగేశ్వరావు వయస్సు సుమారు 25 సంవత్సరాలు. అటువైపు వెళుతున్న పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ఆక్సిడెంట్ చూడంగానే తమ కారునుంచి దిగి క్షతగాత్రులను వెంటనే ముంజులూరు టోల్ ప్లాజా అంబులెన్స్ పిలిపించి గాయపడిన వారిని మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందేలా చూడాలని మచిలీపట్నం ఆసుపత్రి వైద్య సిబ్బందికి సైతం ఫోన్ చేసి చెప్పి మానవత్వం చాటుకున్నారు. అయితే తీవ్రంగా గాయపడిన అబ్దుల్ హాపిద్ కొద్దీ సేపు పోరాడి తుది శ్వాస విడిచారు విషయం తెలుసుకున్న కాగిత కృష్ణా ప్రసాద్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులను చరవాణి ద్వారా పరామర్శ చేశారు. అబ్దుల్ హాపిద్ వారం మొత్తం బంటుమిల్లి లోని ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో పనిచేసి వారాంతంలో తమ గ్రామానికి వెళ్లి ఉంటాడని ఆలా కుటుంబం కోసం వెళ్లే సమయంలో అత్యంత చిన్న వయస్సులో యిలా జరగడం పట్ల పెడన ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బంటుమిల్లి పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ గణేష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

## హనుమాన్ చాలీసా పటించిన కొత్తపేట రామాలయం భక్తులు



**విస్సన్నపేట,జూన్ 27 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలోని కొత్తపేట శ్రీ సీతరామాలయంలో హనుమాన్ చాలీసా( 108 సార్లు) పారాయణం భక్తిశ్రద్ధలతో శ్రీ సీతారామాంజనేయ భక్తులు పట్టించారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివారి ప్రసాదాన్ని అందుకున్నారు.

## భానోదయ పబ్లిక్ స్కూల్లో పుస్తకాలు పంపిణీ



**కృత్తివెన్ను,జూన్ 27 (వార్తాప్రభ) :** కృత్తివెన్ను మండలం సీతనపల్లి సలోబిలోని శ్రీ భానోదయ పబ్లిక్ స్కూల్ లో శనివారం విద్యార్థులకు ఏకలవ్య ట్రస్ట్ విజయవాడ వారి ఆధ్వర్యంలో రాత పుస్తకాలు పెన్నులు పెన్సిల్ ఇతర సామాగ్రిని అందించారు. ఈ పంపిణీ కార్యక్రమాన్ని కృత్తివెన్ను ఎస్ఐ ఏ. పైడి బాబు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై పైడి బాబు, సీనియర్ తెదేపా నాయకుడు పిన్నెంటి రత్తయ్య, ట్రస్ట్ అధ్యక్షుడు బస్వాని నీలాజలం కార్యదర్శి పాశం శ్రీనివాసరావు పెదసింగు హనుమంతరావు తాడేపల్లి గుప్త తదితరులు మాట్లాడుతూ విద్యార్థులంతా చక్కగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ జన్మదినం సందర్భంగా శుక్రవారం పాఠశాలకు సెలవు కావడంతో శనివారం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ తిరుమాని సీతాంబరం కరస్పాండెంట్ కృష్ణకుమారి కేరళ టీచర్లు అంజు మేడం హీనా జ్యోతి అనంతలక్ష్మి విద్యార్థులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో కి సర్వం సిద్ధం

● కృతివెన్ను పి హె చ్ సి వైద్యాధికారి సాయి సందీప్




**కృత్తివెన్ను,జూన్ 27 (వార్తాప్రభ) :** కృతివెన్ను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కి సంబంధించి పల్స్ పోలియో ట్రైనింగ్ ప్రోగ్రామ్ శనివారం మండల పరిషత్ లో హెల్త్ మరియు ఐసిడిఎస్ అధికారులు తో కలిపి నిర్వహించటం జరిగిందని వైద్యాధికారులు డా.సాయి సందీప్. డా.మిథున తెలిపారు పల్స్ పోలియో ప్రోగ్రామ్ లో భాగంగా ఐసిడిఎస్ సూపర్వైజర్, పి హెచ్ సీ సూపర్వైజర్లు ఎన్ఎమ్ లు ఎం ఎల్ హెచ్పీ లు ఆశలు అంగన్వాడీ టీచర్లు అందరూ పాల్గొన్నారని ఈ ఆదివారం జరగబోయే బూత్ యాక్టివిటీస్ హౌస్ టు హౌస్ సర్వే లాజిస్టిక్స్ డిస్ట్రిబ్యూషన్ జరిగిందని అన్నిటి గురించి ట్రైనింగ్ ఇవ్వటం జరిగిందని తెలిపారు అందరూ కలిసి పల్స్ పోలియో ప్రోగ్రామ్ ను విజయవంతం చేయాలని అందరూ పిల్లలకి పోలియో చుక్కలు వేయాలని ఎవర్ని మిస్ చెయ్యకుండా నూరు శాతం కంప్లీట్ అయ్యేలా అందరూ కృషి చేయాలని వైద్యాధికారులు తెలిపారు ఈ కార్యక్రమం లో సూపర్వైజర్స్ మెరమ్మ ఇనయుటుల్ల వైద్య అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు



మార్కాపురం లోని ఒక వివాహానికి శనివారం హాజరైనటువంటి భారత చైతన్య యువజన పార్టీ బి సి వై అధినేత బోడే రామచంద్ర యాదవ్ ను కలిసిన మార్కాపురం బిసివై పార్టీ నాయకులు న్యాయవాది ఎర్ర గొర్ల విజయ వర్ధన్ యాదవ్, పిన్నెబోయిన నాగార్జున యాదవ్, అరవింద్ యాదవ్ ,లక్ష్మణ్ యాదవ్ తదితరులు

**-మార్కాపురం,జూన్ 27 (వార్తాప్రభ) :**

# ఘనంగా 6వ స్నాతకోత్సవం






**నూజివీడు,జూన్ 27 (వార్తాప్రభ) :** ఆర్జీయూకేటీ ఆంధ్రప్రదేశ్ 6వ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. 2022, 2023, 2024, 2025 విద్యాసంవత్స రాలలో ఆంధ్రప్రదేశ్ ఆర్జీయూకేటీ పరిధిలో గల నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు శ్రీకాకుళం ప్రాంగణాలలో బీ.టెక్ మరియు ఎం.టెక్ చదివిన విద్యార్థినీ విద్యార్థులకు పట్టా ప్రదానోత్సవం జరిగింది. పైన పేర్కొన్న విద్యా సంవత్సరా లలో బీ.టెక్ చదివి టాపర్స్ గా నిలిచిన 26మంది విద్యార్థినీ విద్యార్థులకు, ఎం.టెక్ చదివిన 8మంది విద్యార్థినీ విద్యార్థులకు ముఖ్య అతిథి, భారత ప్రభుత్వ నీతి ఆయోగ్ సభ్యులు ఆచార్య గోబర్ధన్ దాస్, ఆర్జీయూకేటీ కులపతి ఆచార్య కొత్త మధుమూర్తి, ఉప కులపతి ఆచార్య మద్దాలి లక్ష్మీ నారాయణ రావు చేతుల మీదుగా పట్టా ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మరియు భారత ప్రభుత్వ నీతి ఆయోగ్ సభ్యులు ఆచార్య గోబర్ధన్ దాస్ మాట్లాడుతూ "ప్రతిభావంతమైన గ్రామీణ యువతకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందించడం మరియు నిజమైన విద్యా సమానత్వాన్ని ప్రోత్సహించడం అనే దృష్టితో ఈ సంస్థ స్థాపించబడింది. మీరు విభిన్న నేపథ్యాల నుండి ఈ సంస్థలో ప్రవేశించి, నేడు సమాన స్థాయిలో బలమైన ఇంజినీరింగ్ పునాదులతో పట్టభద్రులవు తున్నారు. భారతదేశం ప్రస్తుతం ఒక మార్పు దశలో ఉంది. ఎన్ఈపీ-2020 బహు శాఖల అభ్యాసాన్ని ప్రోత్సహిస్తూ సంప్రదాయ విద్యా విభజనలను తొలగిస్తోంది. నేటి సమస్యలు పరిష్కరించడానికి ఇంజినీరింగ్, సైన్స్ మరియు హ్యూమానిటీస్ కలిసిన సమగ్ర ఆలోచన అవసరం. వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని సాధించడానికి మీరు కేవలం ఉద్యోగార్థులు కాకుండా ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు మరియు సమస్య పరిష్కారకులుగా మారాలి. ఈ రోజు పట్టభద్రు లలో దాదాపు రెండు- మూడవ వంతు మహిళలు ఉండటం నాకు ప్రత్యేక గర్వకారణం. ఇది భారతదేశం యొక్క సమగ్రత మరియు మహిళా సాధికారత పట్ల ఉన్న కట్టుబాటును ప్రతిబింబిస్తుంది. ప్రతి మహిళా ఇంజినీర్ తన కుటుంబానికి, సమాజానికి మరియు దేశానికి పురోగతిని తీసుకువస్తుంది. మీ వృత్తి జీవితంలో విజయానికి కేవలం సాంకేతిక నైపుణ్యం మాత్రమే కాకుండా మానసిక సమతుల్యత కూడా అవసరం. మన సంప్రదాయ జ్ఞానం మరియు యోగ వంటి సాధనాలు ఈ వేగవంతమైన సాంకేతిక ప్రపంచంలో ఏకాగ్రత, సహనశక్తి మరియు స్థిరత్వాన్ని అందిస్తాయి. ఇంజినీర్లుగా మీ బాధ్యత ఉద్యోగం పొందడానికే పరిమితం కాదు. కంప్యూటింగ్, సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ లేదా ఇతర రంగాల్లో మీరు పనిచేసినా, వాతావరణ మార్పు, శక్తి, ఆరోగ్యం మరియు గ్రామీణ అభివృద్ధి వంటి సమస్యలకు స్థిరమైన, సమానమైన మరియు సమాజానికి ఉపయోగపడే పరిష్కారాలను రూపొందించడం మీ కర్తవ్యం. ముగింపుగా, మీ పట్టా కేవలం ఒక సాధన మాత్రమే కాదు, ఒక బాధ్యత కూడా. మీ జ్ఞానాన్ని లక్ష్యంతో, నైతికతతో మరియు మానవత్వంతో ఉపయోగించి మెరుగైన భవిష్యత్తును నిర్మించండి" అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి చైర్మన్ మరియు ఆర్జీయూకేటీ ఆంధ్రప్రదేశ్ కులపతి ఆచార్య మధుమూర్తి మాట్లాడుతూ "గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రపంచ స్థాయి సాంకేతిక విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటైన ఆర్జీయూకేటీ నేడు రాష్ట్రానికి, దేశానికి ప్రతిభావంతులైన ఇంజినీర్లను అందిస్తున్నదని ఆయన తెలిపారు. విద్యార్థుల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ (ఏఐ& ఎం.ఎల్)లో బీటెక్, మైనర్ కోర్సులు, కొత్త ఎం.టెక్ కోర్సులను ప్రారంభించడంతో పాటు ప్రయోగశాలలు, డిజిటల్ లెర్నింగ్, హాస్టళ్లు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.20 కోట్లకు పైగా వ్యయం చేసినట్లు వెల్లడించారు. దేశంలోనే ప్రభుత్వ విద్యాసంస్థలలో అత్యధికంగా 11,539 ఎన్పీటీఈఎల్ సర్టిఫికేషన్లు సాధించడం, 539 మంది విద్యార్థులు దేశవ్యాప్తంగా టాప్-1 శాతంలో నిలవడం విశేషమని పేర్కొన్నారు. క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో ఆర్జీయూకేటీ విశేష పురోగతి సాధించిందని, ఐబీఎం నిర్వహించిన క్విజిట్ ఫాల్ ఫెస్ట్-2025కు ప్రపంచం లోని ఎంపికైన 11 ఉన్నత విద్యాసంస్థల్లో ఆర్జీయూకేటీ చోటు దక్కడం విశ్వవిద్యాలయ ప్రతిష్ఠను మరింత పెంచిందన్నారు. నూజివీడు, ఆర్కే వ్యాలీ క్యాంపస్లలో జాతీయ క్వాంటమ్ మిషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రయోగశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో విశ్వవిద్యాలయం మొత్తం 84 శాతం ప్లేస్మెంట్లు నమోదు చేసిందని, 557 ఉద్యోగ అవకాశాలు లభించాయని, అత్యధికంగా రూ.28 లక్షల వార్షిక వేతన ప్యాకేజీ సాధించారని పేర్కొన్నారు. కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, మెటలర్జికల్ విభాగాల్లో 100 శాతం ప్లేస్మెంట్లు నమోదయ్యాయని, 75 ప్రముఖ సంస్థలు క్యాంపస్ నియామకాలు నిర్వహించాయని వెల్లడించారు. అలాగే 800 మందికి పైగా విద్యార్థులు గేట్ అర్హత సాధించగా, పలువురు ఐఐటీలు, ఎన్ఐటీలలో ఉన్నత విద్యకు ఎంపికయ్యారని తెలిపారు. మహిళా విద్యార్థుల సాధికారత కోసం 'నారీ శక్తి' కార్యక్రమం ద్వారా యూపీఎస్సీ, గేట్ శిక్షణకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తున్నట్లు వివరించారు. సాంకేతిక నైపుణ్యాలతో పాటు నిజాయితీ, విలువలు, సామాజిక బాధ్యతను జీవితాంతం పాటించాలని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తమ జ్ఞానాన్ని వినియోగిస్తూ దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని" విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉపకులపతి ఆచార్య మద్దాలి లక్ష్మీ నారాయణరావు విశ్వవిద్యాలయం వార్షిక నివేదికను ప్రకటిస్తూ "నాణ్యమైన విద్య, వినూత్న బోధన, ఫలితాధారిత విద్యా విధానం (Outcome-Based Learning), నైపుణ్యాభివృద్ధి ద్వారా మా విశ్వవిద్యాలయం విద్యా ప్రగతిలో నిరంతరం ముందుకు సాగుతోంది. మా విద్యార్థులు ఎన్పీటీఈఎల్ సర్టిఫికేషన్లు, ఇంటర్న్‌షిప్లు మరియు ప్రముఖ సంస్థల్లో క్యాంపస్ నియామకాలలో విశిష్ట విజయాలు సాధించారు. మహిళా సాధికారత ఆర్జీయూకేటీ ప్రత్యేకతల్లో ఒకటి. మా విద్యార్థినులు విద్య, పరిశోధన, ఆవిష్కరణ, క్రీడలు మరియు నాయకత్వ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విశ్వవిద్యాలయా నికి గౌరవాన్ని తీసుకు వచ్చారు. ఈ రోజు ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు మరియు మెరిట్ పతకాలను ప్రదానం చేయడం మాకు ఎంతో గర్వకారణం. విశ్వవిద్యాలయ అభివృద్ధికి నిరంతర సహకారం అందించిన అధ్యాపకులు, సిబ్బంది, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు మరియు పరిశ్రమల భాగస్వాములు కావడం ఎంతో సంతోష దాయకం" అని పేర్కొన్నారు. ఈ 6వ స్నాతకోత్సవంలో ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ మరియు ఒంగోలు క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య అమరేంద్ర కుమార్ లతో పాటు నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య గోపాలరాజు, శ్రీకాకుళం డైరెక్టర్ ఆచార్య గిరిధర్ మద్రాస్, ఇడుపులపాయ డైరెక్టర్ ఆచార్య గెడ్డం విజయప్రకాష్, సెంట్రల్ డీన్ దువ్వూరి శ్రావణి, సెంట్రల్ ఫైనాన్స్ ఆఫీసర్ డా. నాగార్జున దేవి, ఈఐటీపీ డీన్ శ్యాం, సెంట్రల్ ఇవాల్యుయేషన్ డీన్ రియాజ్, నాలుగు క్యాంపస్ లకు చెందిన అకడమిక్ డీన్స్, ఏవో డా. లక్ష్మణరావు, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ వెల్ఫేర్స్ డా. రాజేష్, డా. దుర్గాభవానీ, చీఫ్ వార్డెన్ సురేష్ బాబు ఇంకా అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా తొలగించకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్**

**అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉండాలి**

**మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్**



**జవహర్ నగర్,జూన్ 27:**(వార్తా ప్రభ)అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉండాలని జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ అన్నారు. శనివారం మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కీసర సర్కిల్ పరిధిలోని 543 544 545 గల బూతులలో ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటరు సవరణ ప్రక్రియ ముగిసే వరకు అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కల్పించుకోవాలని ఆయన తెలిపారు. ప్రతి బిఎల్ ఓ రోజుకు ఒక బూతు పరిధిలో 50 ఇండ్లను సందర్శించి ఓటర్లకు వివరాల పత్రాలను అందజేస్తారని ఆయన తెలిపారు. ఓటర్లు తమ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఓటర్లను నమోదు చేసుకోవాలని బిఎల్ఓ లకు పత్రాలను అందజేయాలని ఆయన తెలిపారు. బిఎల్ ఓ లు సర్వేకు వచ్చిన సమయంలో ఇంట్లో ఎవరు అందుబాటులో లేకపోతే జాబితాలో సదరు ఓటరు పేరును పక్కన మార్కు చేస్తారని అలాంటివారు ఆందోళన చెందకుండా ఆగస్టు నెలలో ఆన్ లైన్ ద్వారా కానీ లేదా నేరుగా తహసిల్దార్ కార్యాలయంలో ఫామ్-8 ద్వారా తమ ఓటు హక్కును భద్రపరచుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, బిఎల్ఓ లు తదితరులు పాల్గొన్నారు.

# లింగాపూర్ విద్యార్థుల జాతీయ సత్తా!!

**ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో రాష్ట్ర ర్యాంకులు**

**లెవెల్ చూపించిన ప్రభుత్వ బడికి ఘన విజయం**




**పెద్దపల్లి/గోదావరిఖని: జూన్ 27** (వార్తాప్రభ ప్రతినిధి)లింగాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మరోసారి తమ సత్తా చాటారు. గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ స్థాయి పోటీల్లో మెరిసి, ప్రతిభకు చిరునామాగా నిలిచారు. ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్స్ నిర్వహించిన ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో టీజీఎంఎస్ లింగాపూర్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించి పాఠశాల ఖ్యాతిని మరింత పెంచారు. బి. అద్వైత్ రాష్ట్రస్థాయిలో 6వ ర్యాంకు సాధించి రూ.700 నగదు స్కాలర్‌షిప్ అందుకోవడం పాఠశాలకు గర్వకారణంగా మారగా, ఎ. శ్రీనిత్ రాష్ట్రస్థాయిలో 17వ ర్యాంకు సాధించి తన ప్రతిభను చాటాడు. విద్యార్థుల విజయాల వెనుక ఉపాధ్యాయుల అంకితభావం నిలిచింది. మ్యాథ్స్‌లో సూర్య భగవాన్, సైన్స్‌లో అఖిల్, ఇంగ్లీష్‌లో జగదీశ్వర్, హిందీలో స్వాతి, సోషల్‌లో సునీత దత్తకు ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్స్ నుంచి అప్రిషియేషన్ సర్టిఫికెట్లు లభించాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. సదానందం విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఉత్తమ ఫలితాల దిశగా నడిపించిన సేవలకు గుర్తింపుగా నేషనల్ వైడ్ అప్రిషియేషన్ సర్టిఫికెట్ అందుకోవడం పాఠశాలకు మరో గౌరవంగా నిలిచింది. ఈ విజయాలు కేవలం ర్యాంకులకే పరిమితం కాకుండా, ప్రభుత్వ పాఠశాలల్లోనూ నాణ్యమైన విద్య అందుతుందనే విషయాన్ని మరోసారి నిరూపించాయి. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పి. సదానందం విజేత విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందిస్తూ, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి లింగాపూర్ పేరు దేశవ్యాప్తంగా నిలబెట్టాలని ఆకాంక్షించారు.

# సర్ పై ఓటర్లకు అవగాహన : మాజీ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి



**మల్కాజిగిరి జూన్ 27** :(వార్తా ప్రభ ప్రతినిధి): వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్,వినోభా నగర్ లో బూత్ నంబర్లు 239,241 వద్ద సర్ ప్రక్రియలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలిస్తూ అర్హులైన ప్రతి ఓటరుకి మాజీ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి అవగాహన కల్పించారు. ప్రతి అర్హుడి ఓటు జాబితాలో కొనసాగేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ, ఒక్క నిజమైన ఓటు కూడా తొలగిపోకుండా కాపాడుకోవాలని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బి ఎల్ ఏ అధికారి తిరుమలదేవి, బీజేపీ నాయకులు మల్లేష్, సాయి సురేష్, సుమలత, ప్రశాంత్ పాల్గొన్నారు.



# యాదవ్ భవన్ ని వెంటనే ప్రారంభించాలి

## ప్రముఖ యాదవ నేతల తీర్మానం



**హైదరాబాద్, జూన్ 27** :(వార్తా ప్రభ ప్రతినిధి) హైదరాబాదులోని ఒక ప్రైవేటు హోటల్ లో అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు మరియు శ్రీకృష్ణ యాదవ భవన్ ట్రస్ట్ చైర్మన్ చింతల రవీంద్రనాథ్ యాదవ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన కార్పొరేషన్ చైర్మన్లను అభినందిస్తూ వారిని నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి కి సమావేశము కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానం చేసింది. చాలా సంవత్సరాలుగా కోకాపేటలో భవన నిర్మాణం పూర్తి అయి పెండింగ్ లో ఉన్న యాదవ భవనాన్ని వెంటనే ప్రారంభించాలని ముఖ్యమంత్రిని కోరుతూ తీర్మానం చేసింది.త్వరలోనే యాదవుల ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి ని కలిసి యాదవుల అభివృద్ధి సంక్షేమం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకునే విధంగా ముఖ్యమంత్రి కి నేరుగా కలిసి విన్నవించుకోవాలని తీర్మానించడమైనది. రాష్ట్రంలోని ప్రముఖ యాదవ నేతలు, విద్యావంతులు, వివిధ యాదవ ప్రజాసంఘాల నాయకులు హాజరై తీర్మానం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర పోలీస్ కంప్లైంట్ అథారిటీ సభ్యులు మరియు మాజీ రాష్ట్ర సమాచార ప్రధాన కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు యాదవ్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ మారబోయిన రఘునాథ్ యాదవ్, రాష్ట్ర లైవ్ స్టాక్ లాజిస్టిక్ ఏజెన్సీ చైర్మన్ కౌశిక్ చరణ్ యాదవ్ , పాలమూరు వైస్ ఛాన్స్ లర్ జి ఎన్ శ్రీనివాస్ యాదవ్, తెలంగాణ స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ చలకాని వెంకట్ యాదవ్ , యాదవ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ గజ్జి భాస్కర్ యాదవ్, ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్స్ లర్ డా దండబోయిన రవీందర్ యాదవ్, అఖిలభారత యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి, పిసిసి జనరల్ సెక్రటరీ రాజబోయిన లక్ష్మణ్ యాదవ్ , శ్రీకృష్ణ యాదవ ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ ముక్కామల వెంకన్నయాదవ్, జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మేకల రాములు యాదవ్, అఖిలభారత యాదవ మహాసభ జాతీయ కార్యదర్శి అయిలబోయిన రమేష్ యాదవ్,రాష్ట్ర గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం అధ్యక్షులు పోచబోయిన శ్రీహరి యాదవ్, మాజీ కార్పొరేటర్లు గొంటి శంకర్ యాదవ్, రాగం నాగేందర్ యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ నేషనల్ కౌన్సిల్ సభ్యులు సందెవేణి మహేంద్రనాథ్ యాదవ్ , నగర యాదవ ప్రముఖులు మైల్ కోల్ మహేందర్ యాదవ్, గుడిగ శ్రీనివాస్ యాదవ్ , కె దేవేందర్ యాదవ్, మేకల రాజేందర్ యాదవ్, వంగ మల్లేష్ యాదవ్ తదితర యాదవ సంఘాల రాష్ట్ర ప్రముఖులు పాల్గొన్నారు.

# ధర్మం, సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలను పరిరక్షించటం ప్రతి ఒక్కరి బాధ్యత

**-బిజెపి ఇంచార్జ్ రవికుమార్ యాదవ్**




**శేరిలింగంపల్లి,జూన్ 27 (వార్తాప్రభ):** రాయదుర్గంలోని మల్కం చెరువు శివాలయంలో నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ మహాకాళేశ్వర లింగ సహిత మహా గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, ధ్వజస్తంభం, నవగ్రహాది ఆలయ శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ ధర్మం, సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పరమేశ్వరుని కృపతో ప్రజలందరికీ ఆరోగ్యం, ఐశ్వర్యం, శాంతి, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులు, దాతలు, వేద పండితులు, సేవకులు, సహకరించిన భక్తులందరికీ అభినందనలు తెలిపారు. మహాకాళేశ్వర స్వామి, మహా గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, నవగ్రహాల అనుగ్రహం ప్రతి కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ యాదవ్, దయాకర్, నరేందర్ ముదిరాజ్, సంజీవ్, శ్యామ్ యాదవ్, రాజు, శ్రీను, విజయ్ కుమార్, యువరాజ్, శ్రీనాథ్, ప్రవీణ్, ప్రభాకర్‌తో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

# పెద్దపల్లిలో విప్ 'అభివృద్ధి, సంక్షేమం' హవా!!

- రూ.40 లక్షలతో పాఠశాల అదనపు గదుల ప్రారంభం
- రూ.10 లక్షల సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన
- ఈ నెల 30 నుంచి 'రైతు భరోసా' జమ
- కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ
- క్రీడా టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతులు
- విప్ చింతకుంట విజయ రమణరావు







**పెద్దపల్లి/గోదావరిఖని: జూన్ 27** (వార్తాప్రభ ప్రతినిధి)జూలపల్లి మండలం చీమలపేట గ్రామంలో శనివారం ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రూ. 40 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదులను ఆయన ప్రారంభించారు. అనంతరం రూ. 10 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సి.సి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా 10 మంది లబ్ధిదారులకు రూ. 10.01 లక్షల విలువైన కళ్యాణలక్ష్మి, షాదీముభారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమని, ఈ నెల 30 నుండి రైతుల ఖాతాల్లో 'రైతు భరోసా' నిధులు జమ అవుతాయని ప్రకటించారు. గతంలో వడ్ల కటింగ్‌లతో రైతులను ముంచిన బిఆర్ఎస్ నేతలు, ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. అర్హులైన ప్రతి పేదవానికి రూ. 5 లక్షల ఇందిరమ్మ ఇల్లు ఇప్పించే బాధ్యత తనదేనన్నారు. అనంతరం తన సోదరుడు చింతకుంట సుధాకర్ రావు జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకల్లో పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. చీమలపేట గ్రామాభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని, అంగన్‌వాడీ భవనం, గ్రామపంచాయతీ రిపేర్ల కోసం మరో రూ. 7 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ కొమ్మ పోచాలు, ఉపసర్పంచ్ మధుకర్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# మతసామరస్యానికి, భక్తుల ప్రగాఢ విశ్వాసానికి ప్రతీక రొట్టెల పండుగ

**భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేపట్టాం**

**జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**

**కుటుంబ సమేతంగా రొట్టెను స్వీకరించిన కలెక్టర్ దంపతులు**



**నెల్లూరు, జూన్ 27** :(వార్తా ప్రభ ప్రతినిధినెల్లూరు బారాషహీద్ దర్గా రొట్టెల పండుగ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల శనివారం కుటుంబ సమేతంగా దర్గాను సందర్శించారు. అనంతరం స్వర్ణాల చెరువు ఘాట్ వద్ద భక్తులతో మమేకమై సాంప్రదాయబద్ధంగా రొట్టెను స్వీకరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ, రొట్టెల పండుగ మతసామరస్యానికి, భక్తుల ప్రగాఢ విశ్వాసానికి నిలువెత్తు నిదర్శనమని అన్నారు. దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు విచ్చేసే ఈ ఆధ్యాత్మిక వేడుకను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేపట్టిందని తెలిపారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సూచనల మేరకు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, త్రాగునీరు, పారిశుధ్యం, వైద్య సేవలు తదితర అంశాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. మంత్రి నారాయణ గారి ప్రత్యేక చొరవతో భక్తుల భద్రత కోసం నాలుగు ప్రత్యేక డ్రోన్లను 24గంటలు విజువల్స్ పరిశీలించేందుకు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లా పోలీసు శాఖ, నగరపాలక సంస్థ, రెవెన్యూ మరియు ఇతర శాఖల అధికారులు నిరంతరం సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. జిల్లా ఎస్పీ అజిత, మున్సిపల్ కమిషనర్ నందన్ ప్రతిరోజు దర్గా ప్రాంతంలో పర్యటిస్తూ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్ని చర్యలు చేపట్టామని, జిల్లా యంత్రాంగం కల్పించిన సౌకర్యాల పట్ల భక్తులు సంతృప్తి వ్యక్తం చేయడం ఆనందంగా ఉందన్నారు. రొట్టెల పండుగ ముగిసే వరకు అప్రమత్తంగా పనిచేస్తూ భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ తెలిపారు.

వార్తా ప్రభ

హైదరాబాద్

# తాగునీటి కొరత తీర్చేందుకు ప్రత్యేక రిజర్వాయర్ నిర్మించండి

**- అధికారులకు ఎం.సి.పి.ఐ. (యు) వినతి**



**శేరిలింగంపల్లి,జూన్ 27** (వార్తాప్రభ):మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎం.ఏ. నగర్, స్టాలిన్ నగర్ కాలనీల్లో తీవ్ర తాగునీటి కొరత నెలకొన్న నేపథ్యంలో శాశ్వత పరిష్కారంగా ప్రత్యేక రిజర్వాయర్ నిర్మించాలని కోరుతూ ఎంసీపీఐ(యూ) మియాపూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ నార్త్ ట్యాంక్ డివిజన్ హాఫీజ్‌పేట్ జీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,అధిక జనాభా ఉన్న బస్తీలకు ప్రాధాన్యతనిస్తూ ముందుగా తాగునీటి సరఫరా చేసి, అనంతరం కమర్షియల్ ప్రాంతాలు, తక్కువ జనసాంద్రత ఉన్న ప్రాంతాలకు నీరు అందించాలని కోరారు. పేద ప్రజల తాగునీటి హక్కును పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపై జీఎం సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత ప్రాంతాలను స్వయంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని,భవిష్యత్తులో నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకురాలు కుంభం సుకన్య, అంగడి పుష్ప, డివిజన్ సహాయ కార్యదర్శి పల్లె మురళి, వెంకటాచారి, ఇంద్ర, అమీనా బేగం, వేణుగోపాల్ రెడ్డి, జగదీష్, బాల్కొండయ్య, పావని, వీరమణి, ఎన్. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమ నేత గొట్టిముక్కుల కుటుంబ సభ్యులను పరామర్శించిన టీ.ఆర్.ఎస్.అధినేత కవిత...



**కూకట్ పల్లి, జూన్ 27(వార్తాప్రభ):**తెలంగాణ తొలి మలిదశ ఉద్యమకారుడు దివంగత నేత గొట్టిముక్కల పద్మారావు కుటుంబ సభ్యులను శనివారం తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పరామర్శించారు. ఈ సందర్భంగా పద్మారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కూకట్పల్లి ప్రాంతం నుండి గొట్టిముక్కల పద్మారావు తన వంతు కృషి చేశారని కొనియాడారు. పద్మారావు ఆకస్మిక మరణం తీరనిలోటని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ మనోధైర్యాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గొట్టిముక్కల పాండురంగారావు, గోటిముక్కల వెంకటేశ్వరరావు, సృజన, బీసీ సంఘర్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబల మహేష్ గౌడ్, మేకల సుదర్శన్, సునీల్ రెడ్డి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా బిజెపి ( ఓబీసీ) రూరల్ అధ్యక్షులుగా... మహేందర్ యాదవ్ ఎన్నిక.

**బిజెపి అధిష్టానానికి కృతజ్ఞతలు.**

**ఎర్రడాల మహేందర్ యాదవ్.**



**జవహర్ నగర్, జూన్ 27:** (వార్తా ప్రభ)బిజెపి మేడ్చల్ రూరల్ జిల్లా ఓబీసీ అధ్యక్షులుగా రెండవసారి ఎర్రడాల మహేందర్ యాదవ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు మేడ్చల్ రూరల్ జిల్లా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు గా ఎన్నికైన మహేందర్ యాదవ్ ను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా మహేందర్ యాదవ్ మాట్లాడుతూ జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షులుగా రెండవసారి అవకాశం ఇచ్చిన బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులకు ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధముల ఆనంద్ గౌడు కు, జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్ కు సహకరించిన స్థానిక బిజెపి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి శ్రేణులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

**మహబూబాబాద్ జూన్ 27** :(వార్తా ప్రభ ప్రతినిధి):శనివారం మహబూబాబాద్ పట్టణంలోని స్నేహ నగర్, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్, గూడూరు)లో స్త్రీ శిశు సంక్షేమ, వయోవృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్ వ్యక్తుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, సూచనల మేరకు సంబంధిత అన్ని విభాగాల శాఖలతో కలిసి మాదకద్రవ్యాల నిరోధక, తీసుకోవలసిన చర్యలు అవగాహన సమావేశం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎక్సైజ్ సూపరిడెంట్ కిరణ్ కుమార్, డిఎంహెచ్వో డాక్టర్ రవి రాథోడ్, డీఎస్పీ తిరుపతిరావు, ఇన్చార్జి వెల్ఫేర్ అధికారిని శిరీష, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ట్రైనింగ్, నిశాంత్ కుమార్, ఇంటర్మీడియట్ అధికారి మదర్, డివైఎస్ఓ జ్యోతి, విద్యాశాఖ అధికారులు శ్రీరాములు, అప్పారావు, స్కూల్ ప్రిన్సిపల్ రమేష్ కుమార్, తదితరులు పిల్లలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ డిఎస్పీ తిరుపతిరావు మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాల నివారణ, కట్టడికి జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని అందులో భాగంగానే అట్టి ప్రదేశాలు,అనుమానిక వ్యక్తులను గుర్తించి తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు,

# సంపాదకీయం

## జనసేన లిట్మస్ టెస్ట్ కి రెడీ ?

జనసేన ఏపీలో మూడవ బలమైన రాజకీయ శక్తిగా ఆవిర్భవించడానికి చూస్తోంది. కూటమిలో ఉంటూనే తన బలాన్ని పెంచుకోవాలని అనుకుంటోంది. దానికి అనేక కారణాలు ఉన్నాయి. ఏపీ లోపలా బయటా ఇటీవల జరిగిన పలు సంఘటనలు జనసేన ఆలోచనలను ప్రభావితం చేస్తున్నాయని చెబుతున్నారు. తెలంగాణాలో జనసేన రీ ఎంట్రీకి రంగం సిద్ధం చెసుకుంటున్న వేళ అక్కడి రాజకీయ ప్రత్యర్థులు చేసిన విమర్శలు కూడా పార్టీలో కసిని పెంచుతున్నాయని అంటున్నారు. అందుకే జనసేన తెలంగాణా ఆఫీసుని అక్కడ ఏర్పాటు చేశారు. అంతే కాదు సంస్థాగతంగా పార్టీని తెలంగాణాలో విస్తరించాలని నిర్ణయించారు. ఇక ఏపీలో చూస్తే జనసేన పూర్తి ఫోకస్ పెడుతోంది. జనసేనను క్షేత్ర స్థాయిలో మరింతగా పటిష్టం చేయాలని అనుకుంటోంది. అందుకోసం పార్టీ పరిశీలకులుగా ప్రతీ జిల్లాలోనూ సీనియర్ నేతలను నియమించింది. ఇక ఈ జిల్లా పరిశీలకుల కమిటీలో ఆ జిల్లాకు చెందిన కీలక నేతలను సభ్యులుగా తీసుకుంది. వీరంతా జనసేనలో చురుకుగా పనిచేస్తున్న నాయకులను గుర్తిస్తారు. వారికి రానున్న రోజులలో పార్టీ పదవులు ఇస్తుందని చెబుతున్నారు. అంతే కాదు వారినే త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి కూడా పచ్చ జెండా ఊపుతారు అని అంటున్నారు. ఇదిలా ఉంటే స్థానిక సంస్థల ఎన్నికలను జనసేన పట్టుదలగా తీసుకుంటోంది. ఎందుకంటే ఇక్కడ గెలిచి మండల అధ్యక్షులుగా జెడ్పీటీసీలుగా కార్పోరేటర్లుగా మున్సిపల్ చైర్మన్లుగా గెలిచిన వారు మూడేళ్ల పాటు తమ బలం మరింతగా పెంచుకుంటే 2029 ఎన్నికల్లో వారినే ముందు పెట్టి ఎమ్మెల్యే అభ్యర్థులుగా తీసుకోవడానికి కూడా జనసేన ఆలోచిస్తోంది అని అంటున్నారు. ఈ నేపథ్యంలో కూటమితో పొత్తులు ఉంటూనే బలమున్న చోట స్నేహ పూర్వక పోటీలకు కూడా జనసేన గ్రీన్ సిగ్నల్ ఇస్తుందని ఊహాగానాలు అయితే సాగుతున్నాయి. అంటే జనసేన మొత్తం బలం ఎంత నేతలకు ఉన్న పట్టు ఎంత జనాల నుంచి ఆదరణ ఎంత పార్టీకి పెరిగిన ఓట్ల శాతం ఎంత ఇవన్నీ కూడా జనసేన స్థానిక ఎన్నికల ద్వారా పరిగణనలోకి తీసుకుని లోతైన అధ్యయనం చేస్తుంది అని అంటున్నారు. ఒక విధంగా స్థానిక ఎన్నికలను జనసేన లిట్మస్ టెస్ట్ గా భావిస్తోంది అని అంటున్నారు. ఈ ఎన్నికల్లో సత్తా చూపించిన నాయకులని చేరదీయడమే కాదు భవిష్యత్తు నాయకులుగా వారికి గుర్తింపు ఇస్తూ ప్రోత్సహించాలని జనసేన పెద్దలు అనుకుంటున్నట్లుగా ప్రచారం సాగుతోంది. పొత్తులో ఉన్నప్పటికీ 2024 ఎన్నికల్లో జనసేనకు ఏకంగా 14 శాతం దాకా ఓట్లు లభించాయని అంచనా ఉంది. దానిని మరింతగా పెంచుకోవాలని జనసేన చూస్తోంది. 2029 ఎన్నికలను జనసేన ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుందని కూడా చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో జనసేన తన లక్ష్యాలను నెరవేర్చుకోవడానికి సరైన వేదికగా భావిస్తోంది అని అంటున్నారు. మొత్తానికి జనసేన ముందు లోకల్ బాడీ ఎలక్షన్స్ ఉన్నాయి. వాటిని జనసేన గట్టి పట్టుదలతో తీసుకుంటోంది. అనూహ్య విజయాలను సాధించడమే కాదు తమ పట్ల జనాభిప్రాయం ఏమిటి అన్నది కొలమానంగా పెట్టుకుని భవిష్యత్తు కార్యచరణకు సిద్ధపడుతోంది అని అంటున్నారు.

## 29 నుంచి జూలై 3 వరకు చిట్టినగర్ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు



**విజయవాడ పశ్చిమ జూన్ 27: (వార్తా ప్రభ ప్రతినిధి)**ఈనెల 29 నుంచి జూలై 3వ తేదీ వరకు చిట్టినగర్ లోని శ్రీ పద్మావతి గోదాదేవి సమేత గరుడాచల స్థిత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు శ్రీ నగరాల సీతారామ స్వామి శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం కమిటీ కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిళ్ళా శ్రీనివాసరావు తెలిపారు. శనివారం దేవస్థానం ప్రాంగణంలో బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను వారు ఆవిష్కరించారు. 29వ తేదీన సహస్ర కలశాభిషేకం,స్వామి వారిని పెండ్లి కుమారుని చేయుట తదితర కార్యక్రమాలు, 30వ తేదీన అగ్ని ప్రతిష్ట ,నవగ్రహారాధన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అలాగే జూలై ఒకటో తేదీన సామూహిక కుంకుమార్చన తదితర కార్యక్రమాలు, అదేరోజు సాయంత్రం ఏడు గంటలకు 250 మంది దంపతులచే శ్రీ స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తామన్నారు. రెండో తేదీ ఉదయం పుష్పయాగం, సాయంత్రం గరుడ వాహనంపై శ్రీ స్వామి వారి నగరోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. మూడో తేదీ ఉదయం పూర్ణాహుతి, సాయంత్రం పవళింపు సేవ తదితర కార్యక్రమాలు ఉంటాయని, ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మజ్జి శ్రీనివాసరావు, పోతిన ధర్మారావు, కామందుల నరసింహారావు, పిళ్ళా విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.






ఏపీ మోడల్ స్కూల్, మతం సరియాపల్లిలో తమ విద్యార్థిని యగు ఉలాల నందు (6వ) చే నిర్వహించిన గణిత అవధానం మరియు మేథా సంపత్తి ప్రదర్శన కార్యక్రమము ఆద్యంతం అందరినీ అబ్బుర పరిచిందని తెలియజేయుటకు గణిత అవధాని మరియు టీచర్ మడ్డు తిరుపతిరావు సంతోషం వ్యక్తం చేశారు-- **వార్తా ప్రభ, శ్రీకాకుళం**

## వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు శ్రీమతి ఎర్రజొన్న విజయలక్ష్మి పార్థివ దేహానికి ఘన నివాళులర్పించిన మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు



**విజయవాడ పశ్చిమజూన్ 27 : (వార్తా ప్రభ ప్రతినిధి)**వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు, రూపాబాయమ్మ ట్రస్ట్ మాజీ చైర్మన్ శ్రీమతి ఎర్రజొన్న విజయలక్ష్మి అనారోగ్యంతో పరమపదించడం పట్ల మాజీ మంత్రివర్యులు, విజయవాడ పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేశారు. విజయలక్ష్మి మరణం పార్టీకి మరియు పశ్చిమ నియోజకవర్గానికి తీరని లోటని ఆయన పేర్కొన్నారు.శనివారం చిట్టినగర్, టైలర్ పేట, ఏనుగుల అంజయ్య వీధిలోని ఆమె నివాసానికి మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు విచ్చేశారు. అక్కడ ఉంచిన విజయలక్ష్మి భౌతికకాయాన్ని ఆయన సందర్శించి, పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పార్టీ బలోపేతానికి ఆమె చేసిన సేవలను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేసుకున్నారు.అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను వెలంపల్లి శ్రీనివాసరావు పరామర్శించి, వారిని ఓదార్చారు. ఈ కష్టసమయంలో కుటుంబానికి వైసిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. శ్రీమతి విజయలక్ష్మి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ దుఃఖాన్ని తట్టుకునే ధైర్యాన్ని ప్రసాదించాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నట్లు వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

## చిన్నారుల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కొరకు పల్స్ పోలియో కార్యక్రమం

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ పశ్చిమ జూన్ 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** చిన్నారుల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసమే పల్స్ పోలియో కార్యక్రమం ఉందని, 0-5 సంవత్సరం లోపు పిల్లలు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆరోగ్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో జూన్ 28న నిర్వహించనున్న ఇంటెన్సిఫైడ్ పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విజయవాడ నగరంలో సుమారు 13,14,037 మంది జనాభా ఉండగా, 3,13,347 గృహాలు ఉన్నాయి. ఆర్‌సీహెచ్ పోర్టల్ ప్రకారం 0--5 సంవత్సరాల వయస్సు గల 87,827 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమం కోసం నగరవ్యాప్తంగా 327 పోలియో బూత్‌లు, 327 బృందాలు, 29 ట్రాన్సిట్ పాయింట్లు, 7 మొబైల్ బృందాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు 39 రూట్ సూపర్వైజర్లు, 1,373 మంది వ్యాక్సినేటర్లు విధుల్లో పాల్గొంటారని తెలిపారు.అలాగే నగరంలోని 40 అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో అవసరమైన వ్యాక్సిన్ నిల్వలు, 40 కోల్డ్ చైన్ పాయింట్లు, 850 వ్యాక్సిన్ క్యారియర్లు సిద్ధంగా ఉంచినట్లు కమిషనర్ వెల్లడించారు.నగరంలోని తల్లిదండ్రులు, సంరక్షకులు తమ 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, పోలియో రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కమిషనర్ ధ్యానచంద్ర విజ్ఞప్తి చేశారు.

## సుజనా ఫౌండేషన్ ఉచిత మెగా వైద్య( శిబిరానికి విశేష స్పందన





**విజయవాడ పశ్చిమ జూన్ 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పశ్చిమ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ఎమ్మెల్యే సుజనా చౌదరి, "సుజనా ఫౌండేషన్" ద్వారా ప్రారంభించిన ఉచిత మెగా వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తుంది.పశ్చిమ లోని పేద , మధ్య తరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని నిరంతరం ఉచితంగా అందించేందుకు నిపుణులైన వైద్యులతో పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేస్తున్నారు.ప్రజారోగ్య సంరక్షణే లక్ష్యంగా శనివారం బబ్బూరి గ్రౌండ్స్, కరకట్ట సౌత్ లో ప్రారంభించిన ఉచిత వైద్య శిబిరాన్ని పశ్చిమ ప్రజలు పెద్ద ఎత్తున సద్వినియోగం చేసుకున్నారు..ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగిన ఈ ఆరోగ్య శిబిరంలో పూర్తిగా ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ, ఎక్స్ రే , వంటి పరీక్షలు నిర్వహించారు.. జనరల్ మెడిసిన్,డెంటల్, కంటి పరీక్షలు, వంటి అనేక అనారోగ్యాలపై సుమారు 100 మందికి నిపుణులైన వైద్యుల బృందం ప్రత్యేక శ్రద్ధతో చికిత్సలు అందించారు. అవసరమైన వారికి అక్కడికక్కడే ఉచితంగా మందులు కూడా పంపిణీ చేశారు..దీనివల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు పెద్ద ఉపశమనం లభించింది.. ప్రజారోగ్యమే లక్ష్యంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో , సుజనా ఫౌండేషన్ ద్వారా వారాంతంలో నిర్వహిస్తున్న ఈ మెగా వైద్య శిబిరాలను పేద, మధ్యతరగతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ విజ్ఞప్తి చేశారు..పీ వీ ఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ పీ వీ ఆర్, డాక్టర్ గురవయ్య, డాక్టర్ ప్రసాద్, శంకర నేత్ర చికిత్సలయం డాక్టర్ వీర్ల అంకమ్మ, డాక్టర్ సంధ్య ,గవర్నమెంట్ డెంటల్ డాక్టర్ ఆంజనేయులు మైనార్టీ నేత మాజీ కార్పొరేటర్ మహ్మద్ అబ్దుల్ ఖాదర్, 40 వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పీ వీ చిన సుబ్బయ్య, సుజనా మిత్రా కోఆర్డినేటర్లు ఈ శిబిరం లో వైద్య సేవలు అందించారు..

## ప్రత్యేక సమగ్ర సవరణను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర





**విజయవాడ పశ్చిమ జూన్ 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్, డిప్యూటీ జిల్లా ఎన్నికల అధికారి, సెంట్రల్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ ధ్యానచంద్ర శనివారం సాయంత్రం ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా తక్కువ పురోగతి నమోదైన పోలింగ్ స్టేషన్ల పరిధిలోని ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని మల్లికార్జునపేట, చిట్టినగర్, సెంట్రల్ నియోజకవర్గం పరిధిలోని మధురానగర్, ప్రాంతాల్లో పర్యటించి ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు.తక్కువ పురోగతికి గల కారణాలను సంబంధిత బూత్ లెవల్ అధికారులు , ఏ ఈ ఆర్ వో లు నుంచి తెలుసుకొని, ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా అవసరమైన సూచనలు చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి అర్హ ఓటరిని సంప్రదిస్తూ ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయడంతో పాటు, ప్రజలు స్వయంగా ఫారాలను పూర్తి చేసి త్వరితగతిన బీఎల్ఓలకు అందజేసేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు.అలాగే ప్రజల నుంచి స్వీకరించిన ఫారాలను వెంటనే డిజిటలైజేషన్ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ప్రతి పోలింగ్ స్టేషన్‌లో రోజువారీ పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.నగరంలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిని కమిషనర్ సమీక్షించారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో మొత్తం 2,69,734 మంది ఓటర్లకు గాను 2,27,376 ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేసి 84.30 శాతం పురోగతి సాధించగా, 20,236 ఫారాలు డిజిటలైజేషన్ పూర్తయ్యాయి. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో మొత్తం 2,77,822 మంది ఓటర్లకు గాను 2,30,320 ఫారాలు పంపిణీ చేసి 82.90 శాతం పురోగతి నమోదు కాగా, 14,920 ఫారాలు డిజిటలైజేషన్ చేశారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో మొత్తం 2,56,980 మంది ఓటర్లకు గాను 2,04,853 ఫారాలు పంపిణీ చేసి 79.72 శాతం పురోగతి నమోదు కాగా, 10,550 ఫారాలు డిజిటలైజేషన్ పూర్తయ్యాయి. మూడు నియోజకవర్గాల్లోనూ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు.ఓటర్ల జాబితా ఖచ్చితత్వాన్ని నిర్ధారించే ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, ప్రజలు కూడా పూర్తి సహకారం అందించాలని కమిషనర్ ధ్యానచంద్ర కోరారు.ఈ పర్యటనలో పశ్చిమ నియోజకవర్గం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, అదనపు కమిషనర్ (జనరల్) ఎ. రవీంద్ర రావు, అదనపు కమిషనర్ శకుంతల, జోనల్ కమిషనర్ ప్రభుదాస్, ఏ ఈ ఆర్ వో లు, సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన ఎరువుల యాప్‌ను రద్దు చేయాలి



**పామర్రు:జూన్ 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రైతులకు, కౌలు రైతులకు ఎరువుల విక్రయాల్లో నూతన యాప్ అడ్డంకిగా మారిందని, పాత పద్ధతిలోనే విక్రయాలు జరపాలని జిల్లా కౌలు రైతు సంఘ కార్యదర్శి పంచకర్ల రంగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాప్ ద్వారా ఎరువుల విక్రయాలకు వ్యతిరేకంగా పామర్రు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. రైతు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు.

## బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం..



**విజయవాడ పశ్చిమ జూన్ 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోనిచిట్టినగర్ లోని శ్రీ పద్మావతి గోదాదేవి సమేత గరుడాచల స్థిత శ్రీ వెంకటేశ్వర స్వామి వార్ల దేవస్థాన బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ కు ఆలయ కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు , కోశాధికారి పిళ్ళ శ్రీనివాసరావు భవాని పురం ఎన్డీఏ కార్యాలయంలో అందజేశారు .ఈ నెల 29 వ తేదీ నుంచి జూలై 3 వ తేదీ వరకు వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు..దేవస్థానం తరపున ఎమ్మెల్యే సుజనా చౌదరి ను ఆహ్వానించామన్నారు..

## అమరావతి ప్రాంతంలో అలజడి సృష్టించేందుకే వైసీపీ నేతల కుట్రలు

- **ప్రజలలో జాతీయవాదాన్ని పెంపొందించడానికి పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారు**
- **కులమత బేధాలు సృష్టించి వైసీపీ సమాజంలో కుట్రలకు పాల్పడుతుంది**
- **పేర్ని నాని, అంబటి రాంబాబులను వైసీపీ నేతలు పట్టించుకోవడం లేదు**
- **జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు పెనుగొండ సుబ్బారాయుడు**



**విజయవాడ పశ్చిమ జూన్ 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రశాంతంగా రాజధాని అమరావతి పనులు వేగవంతంగా జరుగుతున్న సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కుట్రపూరితంగా నేడు అడ్డుకోవడానికి అనేక కుటిల ప్రయత్నాలు చేసి భంగపడ్డారని జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు పెనుగొండ సుబ్బారాయుడు అన్నారు. ఈ సందర్భంగా విజయవాడలో తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రజా రాజధాని అమరావతిని అడ్డుకునే విధంగా మొదటి నుండి వైసీపీ ప్రయత్నిస్తుందని ఆరోపించారు. అమరావతిలో నిర్మాణాలు ఆగిపోయే విధంగా చేయాలన్నది వైసీపీ పని చేస్తుందని విమర్శించారు. వైసీపీలోని కొంతమంది అంబటి రాంబాబు, పేర్ని నాని లాంటి నాయకులు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. ఓట్లు కోసం కుల రాజకీయాలు చేయడం వైసీపీకి పరిపాటే అని, ప్రజలను ఓట్లు కోసం, కుల రాజకీయాలు చేసే ప్రయత్నం జనసేన పార్టీ ఎప్పటికీ చేయదన్నారు. విజయవాడలో రౌడీ షీటర్ కేసులో కూడా నిందితుడుకు కులానికి ఆపాదించి లబ్ధి పొందాలని చూడటం దారుణం అన్నారు. పవన్ కళ్యాణ్ పై మాట్లాడే నైతిక అర్హత కూడా వైసీపీ నేతలకి లేదన్నారు. వైసీపీ పార్టీ గురించి, ఆ పార్టీ నేతల స్వభావం గురించి స్వతహాగా ప్రజలకు ఒక్క ఖచ్చితమైన అభిప్రాయం ఏర్పడిందన్నారు. పవన్ కళ్యాణ్ ని ఒక్క కులానికో, మాతానికో పరిమితం చేయాలని వైసిపి మొదట నుండి కొంతమంది పెయిడ్ ఆర్టిస్టులతో మాట్లాడిస్తుందని, ఈ విషయాన్ని కూడా ప్రజలు నిశితంగా పరిశీలించారని పేర్కొన్నారు .పంచాయతీరాజ్, అటవీ, పర్యావరణ శాఖలకు బాధ్యత వహిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అనేక సంస్కరణలు ఈ శాఖలకు దేశంలోనే అనేక అవార్డులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీసుకువచ్చారని తెలిపారు. పవన్ కళ్యాణ్ నిర్వహిస్తున్న శాఖలలో అవినీతి అక్రమాలు లేకుండా ప్రత్యేక చర్యలు నిరంతరం చేపడుతూ అధికారులు ప్రజలకు జవాబుదారితనంగా పనిచేసే విధంగా చర్యలు తీసుకున్నారని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పంచాయతీరాజ్ శాఖలో తీసుకువచ్చిన సంస్కరణలకు దేశంలోనే ప్రథమ స్థానంలో గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క పంచాయతీ ఉద్యోగులకు కూడా ప్రమోషన్ అనేది దక్కలేదని తెలిపారు. మొదటి సారిగా పంచాయతీ ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చిన ఘనత పవన్ కళ్యాణ్ శాఖకి మాత్రమే దక్కిందని పంచాయతీ ఉద్యోగుల స్వయంగా ఈ విషయాన్ని కూడా వెల్లడించారని గుర్తు చేశారు.

## సమస్యల పరిష్కారానికి యంత్రాంగం కృషి



**మచిలీపట్నం: జూన్ 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పారిశ్రామికవేత్తలు దేశ నిర్మాణంలో కీలకమని, జిల్లాలో ఎంఎస్‌ఎంఈలకు ఎదురయ్యే సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి తెలిపారు. మధ్యతరహా పరిశ్రమల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధికి, ఉపాధి కల్పనకు, ప్రభుత్వ ఆదాయ వృద్ధికి ఎంఎస్‌ఎంఈల పాత్ర అత్యంత కీలకమని అన్నారు.

## సకల లోక నాథుడు

కీర్తనీయుడు దేవుడు
కడు కరుణాసంపన్నుడు
నమ్ముకున్న భక్తులకు
కాపుదల జీవితాలకు
ఆపదలో సహాయకుడు
ఆరాధనకు పాత్రుడు
అవనిలోన భగవంతుడు
అమూల్యమైన స్నేహితుడు
ఉద్ధరించు బ్రతుకులను
మురిపించును మనసులను
సకల లోక పాలకుడు
విశ్వ మానవ ప్రేమికుడు
దీవెనలు ఒసగువాడు
బ్రతుకులను దిద్దువాడు
విశ్వ గురువు దైవము
ప్రపంచానికి దీపము



-గద్వాల సోమన్న,
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# పేపర్ లీకేజీల పై కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి

**ప్రధాని మోదీ తక్షణమే కేంద్ర మంత్రిని బర్తరఫ్ చేయాలి**

**ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్ డిమాండ్**



**ఇబ్రహీంపట్నం, జూన్ 27(వార్తా ప్రభ ప్రతినిధి):**నీట్ ప్రవేశ పరీక్షలతో పాటు మరియు ఇతర ఎంట్రన్స్ పరీక్షల్లో జరిగిన పేపర్ లీకేజీలు పై బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని,లేదా మోదీ వెంటనే మంత్రిని బర్తరఫ్ చేయాలని ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏఐసీసీ అగ్రనేత ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రి పదవి నుంచి పార్టీ సభ్యత్వం నుండి కూడా తొలగించాలని ఇప్పటికే రాష్ట్రపతిని, కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారని అన్నారు.పీసీసీ అధ్యక్షురాలు ఈ ఘటన పై సమాధానం చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారని తెలిపారు. ఇంత జరిగిన ప్రభుత్వం చెల్లించకుండా, కేంద్ర విద్యా మంత్రి విద్యార్థులను మరియు యువతను ఉగ్రవాదులు అనటం దుర్మార్గం అని అన్నారు.దేశంలో నీట్ యుపిఎస్సి వంటి పోటీ పరీక్షల్లో జరుగుతున్న పేపర్ లీకులు, క్రమరాహిత్యాలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయడం. ప్రైవేటు విద్యా సంస్థల మరియు కోచింగ్ సెంటర్లలో పెరుగుతున్న అధిక ఫీజుల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేయడం,ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో జరుగుతున్న ఆలస్యాన్ని ఎండగట్టడం,నిరుద్యోగ సమస్యపై పోరాడటం రాహుల్ ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు అక్కల నాగేంద్ర ప్రసాద్,పోతురాజు థామస్ పాల్ ,రాగాల రాము ,చెరుకు ఆనందరావు మరియు నాయకులు పాల్గొన్నారు.

# నేడు పల్స్ పోలియో చుక్కలు వేయించండి




**చేజర్ల జూన్ 27 (వార్తాప్రభ)** చేజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఈ నెల 28న 29 మరియు 30 వ తేదీలలో జరగబోవు పల్స్ పోలియో కార్యక్రమంలో అప్పుడే పుట్టిన బిడ్డ నుండి 5 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారు. పి.హెచ్.సి. పరిధిలోని 0 నుండి 5 సంవత్సరాల పిల్లలు 2028 అలాగే 3 రూట్లు ఒక్క మొబైల్ మరియు చేజర్ల బస్టాండ్ నందు ట్రాన్సిస్ట్ బూత్ ఉంటుంది. కావున చేజర్ల పి.హెచ్.సి. పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.గతంలో చేజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 33 పల్స్ పోలియో కేంద్రాలు ఉండేవి.కానీ ఈ సంవత్సరశీ నుండి 15 కేంద్రాలను మాత్రమే ఏర్పాటు చేయడం జరిగింది.కావున ప్రజలు ఈ విషయాన్ని గమనించాలి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని చేజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారిణి డాక్టర్ శ్రీమతి మెహతాబ్ తెలియజేసారు.

## జాతీయ రహదారిపై రెండు రోడ్డు ప్రమాదాలు.. ఒకరికి తీవ్రగాయాలు





**సంగం జూన్ 27 (వార్తాప్రభ ప్రతినిధి)** జాతీయ రహదారిపై శనివారం రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఒక ఘటనలో యువకుడు తీవ్రంగా గాయపడగా మరో ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. తరుణవాయి వద్ద జాతీయ రహదారిపై నెల్లూరు నుంచి ఆత్మకూరు వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి రహదారి పక్కకు వెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఎస్.కె. సాజిద్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు.స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అనంతరం గాయపడిన యువకుడిని చికిత్స నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.ఘటనపై స్థానిక పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.మరో ఘటన దువ్వూరు సమీపంలోని జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. అనంతపురం నుంచి నెల్లూరులో జరిగే రొట్టెల పండుగకు వెళ్తున్న కారును వెనుక నుంచి వస్తున్న మినీ లారీ ప్రమాదవశాత్తు ఢీకొట్టింది.ఈ ఘటనలో కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి.అయితే కారు వెనుక భాగం దెబ్బతింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాలకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదాలకు సంబంధించిన వివరాలను నమోదు చేసి విచారణ చేపట్టారు. జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

## పోలియో చుక్కలు వేయిద్దాం.. అంగవైకల్యాన్ని తరిమేద్దాం




**జగ్గయ్యపేట జూన్ 27 (వార్తప్రభ)** చిన్నారులను పోలియో వ్యాధి బారిన పడకుండా కాపాడేందుకు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని పిలుపునిస్తూ జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోలియో చుక్కలు వేయిద్దాం - అంగవైకల్యాన్ని తరిమేద్దాం అనే నినాదాలతో పట్టణంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం తల్లిదండ్రుల బాధ్యత అని వైద్యులు సూచించారు.ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు మాట్లాడుతూ, పోలియో పూర్తిగా నిర్మూలించాలంటే ప్రతి చిన్నారికి సమయానికి పోలియో చుక్కలు వేయించడం ఎంతో అవసరమని తెలిపారు. ప్రజలు పోలియో వ్యాక్సిన్‌పై ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా తమ పిల్లలకు తప్పనిసరిగా చుక్కలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణను శాస్త్రీయంగా, పారదర్శకంగా చేపట్టాలి.

**ఎన్నికల నాటికి ఖచ్చితమైన ఓటరు జాబితాలే లక్ష్యం: జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**



**మచిలీపట్నం జూన్ 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎన్నికల నిర్వహణలో ఎలాంటి గందరగోళానికి తావులేకుండా జిల్లాలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్ ఆఫ్ పోలింగ్ స్టేషన్స్) ప్రక్రియను శాస్త్రీయంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల విభాగం అధికారులతో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు.పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణను రెండు దశల్లో అమలు చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. తొలి దశలో ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సంఖ్యను సమతుల్యం చేసేందుకు ఒకే క్రమంలో ఉన్న వీధులు లేదా పూర్తి వీధులను మాత్రమే బదిలీ చేయాలని సూచించారు. విడివిడిగా కొన్ని ఇళ్లను మాత్రమే మార్చడం వల్ల భవిష్యత్తులో గందరగోళం తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు.రెండో దశలో క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ కాలంలో వాస్తవ నివాస ప్రాంతం ఒకచోట ఉండి, ఓటరు పేరు మరో పోలింగ్ కేంద్రంలో నమోదై ఉన్న వారిని గుర్తించి ఫారం-8 ద్వారా సంబంధిత పోలింగ్ కేంద్రాలకు మార్చే ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన జాబితాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు.ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఈ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించకపోతే స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఓటర్లు తమ వార్డులో కాకుండా వేరే పోలింగ్ కేంద్రాల్లో ఉండే పరిస్థితి ఏర్పడి గందరగోళానికి దారితీసే అవకాశం ఉందన్నారు. అందువల్ల పోలింగ్ కేంద్రాల భౌగోళిక పరిధిని స్పష్టంగా ఖరారు చేసి, ఆ పరిధిలో నివసిస్తున్న ప్రతి ఓటరు అదే పోలింగ్ కేంద్రంలో నమోదై ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రతి పోలింగ్ కేంద్రానికి సంబంధించి భౌగోళిక మ్యాప్‌ను రూపొందించి, ప్రస్తుతం అక్కడ నివసిస్తూ అదే పోలింగ్ కేంద్రంలో ఓటు ఉన్నవారిని, వాస్తవ నివాసం వేరే ప్రాంతంలో ఉండి ఓటు మరో పోలింగ్ కేంద్రంలో ఉన్నవారిని ప్రత్యేకంగా గుర్తించాలని సూచించారు. అలాంటి వారి వివరాలను ప్రత్యేక జాబితాలుగా సిద్ధం చేసి, క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ కాలంలో ఫారం-8 ద్వారా మార్పులు పూర్తి చేయాలని తెలిపారు.పోలింగ్ కేంద్రాల వారీగా బూత్ లెవల్ అధికారుల (బీఎల్ఓ) బాధ్యతలను స్పష్టంగా నిర్వచించి, కొత్తగా తమ పరిధిలోకి వచ్చే ప్రతి ఓటరిని సంబంధిత పోలింగ్ కేంద్రానికి బదిలీ చేసే ప్రక్రియను వారు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి దశను ముందస్తు ప్రణాళికతో అమలు చేసి, ఎన్నికల నాటికి ఎలాంటి గందరగోళం లేకుండా ఖచ్చితమైన ఓటరు జాబితాలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో బందరు ఆర్డీవో కే. సాంబశివరావు, గుడివాడ ఆర్డీవో జి. బాలసుబ్రమణ్యం, గుడివాడ మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ రావు, మచిలీపట్నం నగర మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, ప్లానింగ్ సెక్రటరీలు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# సంగం కోడలు తులసి జ్యోతికి గౌరవ డాక్టరేట్

**ఉత్తమ విద్యా సేవలకు అంతర్జాతీయ గుర్తింపు**




**సంగం జూన్ 27(వార్త ప్రభ ప్రతినిధి)** ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన సంగం గ్రామ కోడలు శ్రీమతి డి. తులసి జ్యోతికి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది.విద్యా రంగంలో ఆమె అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన యూనివర్సిటీ ఆఫ్ సెంట్రల్ అమెరికా ఆమెకు గౌరవ డాక్టరేట్ (డి.లిట్) ప్రకటించింది.ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యా శాఖలతో పాటు సమగ్ర శిక్ష పీఎం శ్రీ మోడల్ స్కూళ్ల పరిధిలో జిల్లా రాష్ట్ర జాతీయ స్థాయిలలో ఆమె కనబరిచిన సేవలు ప్రతిభకు గుర్తింపుగా ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించింది. విద్యార్థుల అభివృద్ధి విద్యా ప్రమాణాల పెంపు పాఠశాలల నిర్వహణలో ఆమె చూపిన కృషి ప్రత్యేక గుర్తింపు పొందింది. విద్యాశాఖతో పాటు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆల్ ఇండియా) సిఫారసుల మేరకు ఈ గౌరవ డాక్టరేట్ అవార్డును ఆమె సొంతం చేసుకున్నారు. వరల్డ్ ఎడ్యుకేషన్ అసెంబ్లీ ప్రాయోజకత్వంలో ఈ అంతర్జాతీయ గుర్తింపు కలిగిన గౌరవ డిగ్రీ అందించడం విశేషంగా నిలిచింది. ప్రస్తుతం వెంకటగిరి ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న తులసి జ్యోతి గతంలో పల్నాడు జిల్లా దుర్గిలో సేవలందించారు.పాఠశాలల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో పాటు విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారు.ఆమె నాయకత్వంలో విద్యా సంస్థలు ఉత్తమ ఫలితాలు సాధించాయని సహచరులు పేర్కొంటున్నారు. తులసి జ్యోతి సంగంకు చెందిన కీ.శే. కంచర్ల నారాయణ ద్వితీయ కోడలు కాగా ప్రముఖ రచయిత పాత్రికేయుడు సేవ తెలుగు భాష సాహితీ సాంస్కృతిక అకాడమీ చైర్మన్ కంచర్ల సుబ్బానాయుడు అర్ధాంగి కావడం స్థానికంగా ఆనందాన్ని కలిగించింది.విద్యా రంగంలో అత్యున్నత శిఖరాలను అధిరోహిస్తూ గౌరవ డాక్టరేట్ సాధించిన తులసి జ్యోతికి విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు విద్యాశాఖ అధికారులు ప్రముఖులు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నారు.

# అమరావతి రైతుల తీర్పు వైసీపీకి గట్టి హెచ్చరిక

**- క్షమాపణ చెప్పే వరకు నైతిక హక్కు లేదు: గొల్ల నరసింహ యాదవ్**



**తిరుపతి, జూన్ 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**అమరావతి రాజధానిని వ్యతిరేకించిన వైసీపీ నాయకులను అమరావతి రైతులు నిరసనలతో వెనక్కి తిప్పి పంపడం చారిత్రాత్మక పరిణామమని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ పేర్కొన్నారు. తిరుపతిలో తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మూడు రాజధానుల పేరుతో అమరావతిని నిర్వీర్యం చేసి, భూములు ఇచ్చిన రైతులను తీవ్ర మానసిక వేదనకు గురిచేశారని విమర్శించారు.ఉండవల్లి, పెనుమాక గ్రామాల్లో పర్యటించేందుకు వచ్చిన మాజీ మంత్రులు పేర్ని నాని, అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవినాష్ తదితరులను అమరావతి రైతులు నల్ల బ్యాడ్జీలు ధరించి, "గో బ్యాక్ వైసీపీ" నినాదాలతో అడ్డుకోవడం ప్రజల ఆవేదనకు నిదర్శనమని అన్నారు. రైతులపై వైసీపీ నాయకులు దాడికి పాల్పడటం అత్యంత దురదృష్టకరమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.అమరావతి ఉద్యమ సమయంలో 1,631 రోజుల పాటు రైతులు, మహిళలు న్యాయమైన పోరాటం చేసినప్పటికీ, అప్పటి వైసీపీ ప్రభుత్వం తప్పుడు కేసులు నమోదు చేయడం, లాఠీచార్జీలు చేయించడం, ఉద్యమాన్ని అణచివేయడానికి ప్రయత్నించడం ప్రజలు ఎప్పటికీ మరచిపోరని నరసింహ యాదవ్ అన్నారు. ప్రస్తుతం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమరావతి నిర్మాణ పనులను వేగవంతంగా కొనసాగిస్తుంటే, రైతుల మధ్య ప్రాంతీయ, కుల విభేదాలు సృష్టించేందుకు వైసీపీ నేతలు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.అమరావతిని ఏకైక రాజధానిగా బహిరంగంగా అంగీకరించి, గతంలో చేసిన వ్యాఖ్యలకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతులకు, రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడం, కోర్టుల ద్వారా ఆటంకాలు కల్పించడం ప్రజలు గమనిస్తున్నారని, అమరావతిలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా వైసీపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పే పరిస్థితి ఏర్పడిందని నరసింహ యాదవ్ పేర్కొన్నారు.

## పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలకు ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) పిలుపు




**జగ్గయ్యపేట జూన్ 27 (వార్తప్రభ)**పిల్లల ఆరోగ్యమే కుటుంబానికి, సమాజానికి నిజమైన సంపద అని పేర్కొంటూ, జూన్ 28 (ఆదివారం) నిర్వహించనున్న పల్స్ పోలియో--2026 కార్యక్రమంలో 0 నుండి 5 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా రెండు పోలియో చుక్కలు వేయించాలని జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా పల్స్ పోలియో--2026 పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. పోలియోను పూర్తిగా నిర్మూలించి, దేశాన్ని పోలియో రహితంగా కొనసాగించాలంటే ప్రతి తల్లిదండ్రి బాధ్యతగా తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని ఆయన అన్నారు. ఒక్క చిన్నారి కూడా మిగలకూడదు. ప్రతి చిన్నారికి రెండు చుక్కలు అందేలా అందరం కృషి చేయాలి అని పిలుపునిచ్చారు.ప్రభుత్వం చేపట్టిన ఈ మహత్తర ప్రజారోగ్య కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమిష్టిగా సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ జె. నాగరాణి, డాక్టర్ షేక్ షైలా, డాక్టర్ డి. రాహుల్, పి. జానకి దేవి, మాదల రామకృష్ణ, తెలుగుదేశం పార్టీ నాయకులు కసుకుర్తి శ్రీనివాసరావు, మల్లెల కొండా తదితరులు పాల్గొన్నారు.

## పోలియో నివారణ అందరి బాధ్యత

**ఇబ్రహీంపట్నం ప్రభుత్వ వైద్యాధికారిని సయ్యద్ ఫర్వీన్**



**ఇబ్రహీంపట్నం, జూన్ 27(వార్తా ప్రభ ప్రతినిధి):**పోలియోను శాశ్వతంగా తరిమికొట్టే విధంగా నివారించడం అందరి బాధ్యత అని అన్నారు ఇబ్రహీంపట్నం ప్రభుత్వ వైద్యాధికారిని సయ్యద్ ఫర్వీన్. రేపటి నుండి 3 రోజులపాటు జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు. ఇబ్రహీంపట్నంలో 28 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశామని, అందుబాటులో ఉన్న పోలియో కేంద్రాలను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఏ ఎన్.ఎం లు, ఆశా వర్కర్లు సమాచార అందిస్తే ఇంటికి వచ్చి పోలియో చుక్కలు వేస్తారని... ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని కోరారు.

## జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ సభ్యుడిగా పోలిశెట్టి తేజ

**నియామకం పత్రం అందజేసిన పార్టీ అధిష్టానం**



**ఇబ్రహీంపట్నం, జూన్ 27(వార్తా ప్రభ ప్రతినిధి)** :జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ విజయవాడ పార్లమెంట్ కమిటీ సభ్యుడిగా ఇబ్రహీంపట్నం మండలం తుమ్మలపాలెం గ్రామానికి చెందిన పోలిశెట్టి తేజ నియామకమయ్యారు. పార్లమెంట్ అబ్జర్వర్స్ కమిటీ సభ్యులలో తేజ ఒకరు. తేజ తుమ్మలపాలెం ఎంపీటీసీ సభ్యుడిగా జనసేన పార్టీ తరఫున గెలుపొందారు. ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడిగా పని చేశారు. వ్యక్తిగత కారణాలతో కొంతకాలం పార్టీలో స్తబ్దత గా ఉన్న ఆయన సేవలను పార్టీ అధిష్టానం గుర్తించి కీలక బాధ్యతలు అప్పచెప్పారు. తిరిగి పార్టీలో క్రియాశీలకంగా ఉంటూ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని, నియమించడం పట్ల సంతోషం వ్యక్తం చేసి జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు తేజ.

## యాత్రికులతో కిటకిటలాడిన సంగం బ్యారేజి

**కట్టుదిట్టమైన సంగం పోలీసు బందోబస్తు**



**సంగం జూన్ 27(వార్త ప్రభ ప్రతినిధి)** రొట్టెల పండుగ సందర్భంగా నెల్లూరుకు భారీగా తరలివచ్చిన యాత్రికులతో సంగం బ్యారేజి సందడిగా మారింది. భారాషాహీద్ దర్గా దర్శనం అనంతరం కుటుంబ సభ్యులు బంధుమిత్రులతో కలిసి పెద్ద సంఖ్యలో యాత్రికులు సంగం బ్యారేజికి చేరుకుని ప్రకృతి అందాలను ఆస్వాదించారు. పెన్నా నది తీర ప్రాంతం చెట్ల నీడలో కుటుంబాలతో కలిసి వంటలు చేసుకుని యాత్రికులు సేదతీరారు. చిన్నారులు మహిళలు పెద్దలు బ్యారేజి పరిసరాల్లో గడుపుతూ ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించారు.పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో సంగం బ్యారేజి పరిసరాలు కిక్కిరిసిపోయాయి. యాత్రికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. తహసీల్దార్ సారంగపాణి, సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్సై భోజ్యా నాయక్, ఇరిగేషన్ ఏఈ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా అమలు చేశారు. ముఖ్యంగా ఎవరూ బ్యారేజిలోకి దిగకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించారు. ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా యాత్రికులకు సూచనలు చేస్తూ పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించారు. ప్రజలు కూడా అధికారుల సూచనలు పాటిస్తూ సహకరించడంతో కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగింది. రొట్టెల పండుగ సందర్భంగా దర్గా దర్శనం అనంతరం సంగం బ్యారేజిని సందర్శించే సంప్రదాయం ఉండటంతో ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా యాత్రికుల సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## వాటర్ ట్యాంక్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**జగ్గయ్యపేట జూన్ 27 (వార్తప్రభ)** పట్టణంలోని శాంతినగర్ లో జాతీయ జెండా వద్ద సుమారు రూ.3 కోట్ల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న 12 లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ నిర్మాణ పనుల పురోగతిని శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూకూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు.శాంతినగర్ ప్రాంత ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు 12 లక్షల లీటర్ల వాటర్ ట్యాంక్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ ట్యాంక్ నిర్మాణం పూర్తయిన తర్వాత ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన నీటి సరఫరా అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గుత్తికొండ శ్రీనివాసరావు, కళ్యాణం సూర్య ప్రకాష్, గింజుపల్లి కృష్ణ మరియు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బిల్లుపాడు పాఠశాల విద్యార్థులకు డైరీలు పంపిణీ

**10,000 వేలు విరాళంగా ఇచ్చిన పాదర్తి వెంకటరామ నాయుడు కుటుంబీకులు**





**చేజర్ల జూన్ 27 (వార్తాప్రభ)** చేజర్ల మండలంలోని బిల్లుపాడు జిల్లా పరిషత్ హై స్కూల్ లో 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న సుమారు 150 మంది విద్యార్థిని విద్యార్థులకు కలువాయి మండల ద్వితీయ విద్యాశాఖ అధికారి సద్దా జనార్దన్ రెడ్డి చేజర్ల మాజీ విద్యాశాఖ అధికారి కామిశెట్టి శ్రీనివాసులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండారెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు డైరీలను పంపిణీ చేశారు. విద్యార్థులకు డైరీలు మరియు ఫ్యాన్ ల కొరకు బిల్లుపాడు గ్రామానికి చెందిన పాదర్తి వెంకట రామానాయుడు జ్ఞాపకార్థంగా వారి కుమారుడు అల్లుడు భార్గవ్ శశికిరణ్ 10000 వేలు రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి పాఠశాల ఉపాధ్యాయులు గ్రామస్తులు ఆ దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. దాతల సహకారంతో పాఠశాలలో మండల ద్వితీయ విద్యాశాఖ అధికారి ఎస్.జనార్దన్ రెడ్డి చేజర్ల మండల మాజీ మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు మరియు రిటైర్డ్ టీచర్ గురు బ్రహ్మేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ అధికారులకు ఖరీఫ్ సన్నద్ధతపై శిక్షణ

**- వర్క్‌షాప్ విజయవంతం**



**జగ్గయ్యపేట జూన్ 27 (వార్తప్రభ)** ఆంధ్రప్రదేశ్ -- రాబోయే ఖరీఫ్ సీజన్‌లో వాతావరణ మార్పులను ఎదుర్కొనేలా రైతులను సన్నద్ధం చేసేందుకు, ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ శాఖ, ఆత్మ మరియు గరికపాడు వ్యవసాయ పరిశోధనా కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో జూన్ నెల శిక్షణ మరియు సందర్శన వర్క్‌షాప్ విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిణి (డి ఏ ఓ ) డి.ఎం.ఎఫ్. విజయ కుమారి, ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డా. యు. విజయ భాస్కర్ రెడ్డి, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ జి. శ్రీనివాసరావు, పలువురు ఏడీఏలు, ఏఓలు, ఉద్యానవన అధికారులు మరియు కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. సమావేశం ప్రారంభంలో ఏడీఏలు తమ ప్రాంతాల్లోని వర్షపాతం, పంటల సాగు విధానాలను వివరించారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారిణి విజయకుమారి మాట్లాడుతూ కొత్తగా వచ్చిన 'ఏ.పి.ఏ.ఐ.ఎం.ఎస్ 2.0' యాప్ గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వర్షాభావ (ఎల్ నినో) పరిస్థితులు వస్తే ప్రత్యామ్నాయ పంటలు వేసేలా రైతులను సిద్ధం చేయాలని, అలాగే 'ఈ-క్రాప్' నమోదును 100 శాతం కచ్చితంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత ప్రకృతి వ్యవసాయ మేనేజర్ జి. శ్రీనివాసరావు మాట్లాడుతూ వర్షాకాలానికి ముందుగానే విత్తనాలు వేసే విధానం మరియు ఇళ్ల వద్దే పోషక వనాలు పెంచుకోవడంపై రైతులను ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డా విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఎరువులను తగిన మోతాదులోనే వాడాలని, నేల ఆరోగ్యాన్ని కాపాడే జీవన ఎరువుల (బయో-ఫెర్టిలైజర్స్) వాడకాన్ని పెంచాలని సూచించారు. గరికపాడు కేవీకే శాస్త్రవేత్తలు మాట్లాడుతూ. వాతావరణ మార్పులను తట్టుకుని త్వరగా చేతికొచ్చే (స్వల్పకాలిక) పంటల రకాలను రైతులకు పరిచయం చేయాలన్నారు. భూసార పరీక్షలు చేసిన తర్వాతే ఎరువులు వాడితే రైతుల పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని స్పష్టం చేశారు. చివరగా, అధికారులంతా గరికపాడు వ్యవసాయ పరిశోధనా కేంద్రాన్ని సందర్శించి, అక్కడ జరుగుతున్న వ్యవసాయ పరిశోధనలు, కొత్త సాగు పద్ధతులను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు.

## తిరుమలలో భారీ రద్దీ.. సోమవారం వీఐపీ బ్రేక్ దర్శనాలు, శ్రీవాణి కరెంట్ బుకింగ్ టికెట్లు రద్దు

**తిరుమల, జూన్ 27 :(వార్తా ప్రభ ప్రతినిధి):** తిరుమలలో అనూహ్యంగా భక్తుల రద్దీ పెరగడంతో అధిక సంఖ్యలో భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించేందుకు సోమవారం వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేసినట్లు టీటీడీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆదివారం వీఐపీ దర్శనాల కోసం సిఫార్సు లేఖలను స్వీకరించబోమని స్పష్టం చేసింది. అదేవిధంగా ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్ ద్వారా ప్రతిరోజూ జారీ చేసే 800 శ్రీవాణి దర్శన టికెట్లను కూడా ఆదివారం, సోమవారం రోజుల్లో జారీ చేయడం నిలిపివేసినట్లు తెలిపింది. భక్తులు ఈ మార్పులను గమనించి తమ తిరుమల యాత్రను ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం



తిరుమలలో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్టుమెంట్లు పూర్తిగా నిండి పోయాయి. బయట క్యూ లైన్లు బాలాజీ నగర్ వరకు విస్తరించగా, ఇంకా వేలాది మంది భక్తులు తిరుమలకు చేరుకునే అవకాశం ఉందని అ ది, కా ం ల ం తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ సీనియర్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నట్లు టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి వెల్లడించారు.

# ఎన్‌టీపీసీలో విద్యుత్ భద్రత అవగాహన!!

- పాఠశాల విద్యార్థులకు సేఫ్టీ సూచనలు!
- విద్యుత్ ప్రమాదాల నివారణే లక్ష్యంగా కార్యక్రమం
- తడి చేతులతో విద్యుత్ పరికరాలు తాకవద్దు






**పెద్దపల్లి/గోదావరిఖని: జూన్ 27 (వార్తాప్రభ ప్రతినిధి)** జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలు (జూన్ 26 నుంచి జూలై 2 వరకు) సందర్భంగా ఎన్‌టీపీసీ రామగుండం, తెలంగాణ ఆధ్వర్యంలో టౌన్‌షిప్ పరిధిలోని పలు పాఠశాలల్లో విద్యుత్ భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కేంద్రీయ విద్యాలయం, శ్రీ చైతన్య పాఠశాల, సెయింట్ క్లేర్ స్కూల్‌తో పాటు ఇతర విద్యాసంస్థల్లో విద్యార్థులకు విద్యుత్ వినియోగంలో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యుత్ పరికరాలను తడి చేతులతో తాకకూడదని, దెబ్బతిన్న విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలని, విద్యుత్ స్థావరాల సమీపంలో ఆటలు ఆడరాదని, ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తే వెంటనే పెద్దలకు తెలియజేయాలని సూచించారు. ప్రదర్శనలు, అవగాహన ప్రసంగాలు, ఇంటరాక్టివ్ సెషన్ల ద్వారా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా విద్యుత్ భద్రత అంశాలను వివరించారు. ప్రతి విద్యార్థి తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, పొరుగువారికి కూడా ఈ విషయాలను తెలియజేస్తూ "సేఫ్టీ అంబాసిడర్"గా వ్యవహరించాలని ప్రోత్సహించారు. "విద్యుత్ భద్రత అనేది యాదృచ్ఛికం కాదు... మన ఎంపిక" అనే సందేశాన్ని వక్తలు విద్యార్థులకు అందించారు. విద్యుత్ ప్రమాదాలను నివారించడంలో ప్రతి ఒక్కరి బాధ్యత ఎంతో కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు విద్యుత్ భద్రతా నియమాలను పాటిస్తామని, ఇతరుల్లో కూడా అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు విశేష స్పందన చూపగా, ప్రజల్లో భద్రతా సంస్కృతిని పెంపొందించేందుకు విద్య, అవగాహన, ప్రజల భాగస్వామ్యంతో ఎన్‌టీపీసీ రామగుండం, తెలంగాణ నిరంతరం కృషి చేస్తోందని నిర్వాహకులు తెలిపారు.

# మాంసం వ్యాపారులకు సీరియస్ వార్నింగ్!!

- అపరిశుభ్రంగా ఉంటే లైసెన్సులు రద్దు
- ప్రజల ఆరోగ్యంతో ఆటలాడితే ఊరుకోం
- వ్యర్థాలను కాలువల్లో వేస్తే భారీ జరిమానా
- పశు వధశాలలనే ఉపయోగించాలి
- ప్లాస్టిక్ కవర్లపై నిషేధం కఠినతరం
- మార్కెట్ పక్కన 40 అడుగుల రోడ్డుకు మార్గదర్శకాలు
- రామగుండం మేయర్ మహంకాళి స్వామి





**పెద్దపల్లి/గోదావరిఖని: జూన్ 27 (వార్తాప్రభ ప్రతినిధి)** అపరిశుభ్ర వాతావరణంలో మాంసం విక్రయాలు జరిపితే లైసెన్సు రద్దు చేయడమే కాకుండా, మార్కెట్ నుండి శాశ్వతంగా ఖాళీ చేయిస్తామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి వ్యాపారులను తీవ్రస్థాయిలో హెచ్చరించారు. శనివారం 39వ డివిజన్ శివాజీనగర్ కూరగాయల మార్కెట్ సందర్శనలో భాగంగా, మాంసం దుకాణాల వద్ద నెలకొన్న అపరిశుభ్రతపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మునిసిపల్ వాహనాలకు చెత్త ఇవ్వకుండా పురుగులు పట్టేదాకా నిలువ ఉంచడం, మాంసం వ్యర్థాలను కాలువల్లో పడేయడంపై మండిపడుతూ, ఇకపై ఇలాంటి పనులు పునరావృతమైతే కఠిన చర్యలు ఉంటాయని, అందరూ తప్పనిసరిగా పశు వధశాలనే ఉపయోగించుకోవాలని స్పష్టం చేశారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున, ఇలాంటి అపరిశుభ్ర పరిస్థితుల్లో విక్రయాలు జరిపి ప్రజల ఆరోగ్యంతో ఆటలాడవద్దని ఆయన హితవు పలికారు. ఒకవైపు స్థానిక ఎమ్మెల్యే సుమారు ?4 కోట్ల నిధులు మంజూరు చేయించి మార్కెట్‌ను అందంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దుతుంటే, మరోవైపు వ్యాపారులు దుర్గంధపు వాసనతో కనీసం నిలబడలేని విధంగా మార్కెట్‌ను అస్తవ్యస్తంగా తయారు చేయడం ఎంతమాత్రం సరికాదని మేయర్ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే దుకాణాల ముందరి వ్యర్థాలు, పాత వస్తువులను తక్షణమే తొలగింపజేసిన ఆయన, నీడ కోసం క్రమపద్ధతిలో రేకులు వేసుకోవాలని సూచించారు. మార్కెట్‌లో నిషేధిత ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తే, రోడ్లపై చెత్త వేస్తే పరిమాణాన్ని బట్టి భారీ జరిమానాలు విధించాలని అధికారులను ఆదేశించారు. అలాగే, కూరగాయల వ్యర్థాలను మార్కెట్ పరిధిలోనే రీసైక్లింగ్ చేయడానికి చర్యలు తీసుకోవాలని, మార్కెట్ పక్కన 40 అడుగులకు తగ్గకుండా కొత్త రోడ్డు నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ పారిశుధ్య ప్రత్యేక డ్రైవ్‌లో పాల్గొన్న మునిసిపల్ సిబ్బందికి అల్పాహారం అందించిన లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం నిర్వాహకులను, వారి 1000 రోజుల సేవా కార్యక్రమ మైలురాయిని అభినందిస్తూ మేయర్ మహంకాళి స్వామి ఈ పర్యటనను ముగించారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితులకు స్వయంగా అందజేసిన ఎమ్మెల్యే



**జగ్గయ్యపేట జూన్ 27 (వార్తప్రభ)** జగ్గయ్యపేట నియోజకవర్గం నందిగామ మండలం మాగల్లు గ్రామానికి చెందిన అంగర రాంబాబు , తుమ్మల రాంబాబు వివిధ అనారోగ్య సమస్యల కారణంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు, శస్త్రచికిత్సలు చేయించుకుని భారీగా వైద్య ఖర్చులు భరించారు. అనంతరం వారి మెడికల్ బిల్లులను స్థానిక నాయకుల ద్వారా శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) సిఫార్సుతో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేశారు. ప్రభుత్వం వారి దరఖాస్తులను పరిశీలించి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అంగర రాంబాబు కి రూ.2,71,140 (రెండు లక్షల 71 వేల 140 రూపాయలు), తుమ్మల రాంబాబు కి రూ.48,905 (నలభై ఎనిమిది వేల 905 రూపాయలు) మంజూరు చేసింది. ఈ సందర్భంగా మాగల్లు గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో వైద్య చికిత్సల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రతి అర్హుడికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా తన వంతు కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు తమకు ఆర్థిక భారం తగ్గేలా ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు చేయించడంలో ప్రత్యేక చొరవ తీసుకున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) కి, రాష్ట్ర ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తోట నాగమల్లేశ్వరరావు, సూరంపల్లి అప్పారావు, శేషగిరి, పావులూరి రమణ, మేడి ప్రభాకర్, ఓర్సు శివ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## శిల్పారామం లో ఆకట్టుకున్న వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు



**శేరిలింగంపల్లి,జూన్ 27 (వార్తాప్రభ):** మాదాపూర్ లోని శిల్పారామం లో నిర్వహించిన వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా అరుణ శ్రీనివాస్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. గణపతి గీతం, బ్రహ్మాంజలి, జతిస్వరం, శివాష్టకం, కోలాటం, పలుకు తేనెల తల్లి, హనుమాన్ చాలీసా, వందన, జయ జనార్ధన, కస్తూరి తిలకం, గరుడ గమన, తిల్లాన వంటి అంశాలను సరయు, సంహిత, నిధిమా, గాంగ్నా, జోషిత, కైవల్య, వైష్ణవి, అశ్వి, రుచిక,విభా తదితర కళాకారులు అద్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. అదేవిధంగా ఉదయం సుచేత ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు పెయింటింగ్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. దాదాపు 100 మంది విద్యార్థులు తమ చిత్రాలను ప్రదర్శించడంతో పాటు విక్రయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులందరినీ నిర్వాహకులు ప్రశంసాపత్రాలతో సత్కరించారు.

## ప్రజల దైనందిన అవసరాలకు వారాంతపు సంతలు ఎంతగానో ఉపయోగపడతాయి.

**మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్.**

**జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి శ్రీకాంత్ యాదవ్.**



**జవహర్ నగర్ జూన్ 27: (వార్తా ప్రభ)** ప్రజల దైనందిన(అవరాలకు) వస్తువులకు ఆలంబనలు వారాంతపు సంతలేనని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ స్పష్టం చేశారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ చంద్రపురి కాలనీ డివిజన్ శాంతినగర్ లో వారాంతపు సంతను, (వీక్లీ మార్కెట్) జవహర్ నగర్ మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్ తో కలిసి శనివారం శ్రీకాంత్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలకు నిత్య అవరాలైన కూరగాయలు సరసమైన ధరలకు అందుబాటులో ఉండేందుకు వారాంతపు సంతలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. గరీబోళ్లకు నిలయమైన జవహర్ నగర్ లో వారాంతపు సంతలు ఎంతో అవసరమన్నారు. వ్యాపారులు స్వచ్ఛమైన తాజా కూరగాయలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు చిట్టిబాబు, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మాట్ల వినయ్ కుమార్, సీనియర్ నాయకులు భాగ్య, సుగుణ, సాయి కృష్ణ, గజ్వేల్, శంకర్, సరిత తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర వికాసానికి నో బ్యాగ్ డే



**ఇబ్రహీంపట్నం,జూన్ 27(వార్తా ప్రభ ప్రతినిధి):** మండల పరిధిలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, కాచవరం నందు ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మరియు సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న "నో బ్యాగ్ డే" కార్యక్రమం విద్యార్థులలో విశేష ఉత్సాహాన్ని నింపుతోంది. గతంలో "నో బ్యాగ్ డే" కార్యక్రమం పరిమిత స్థాయిలో నిర్వహించబడగా, ప్రస్తుతం విద్యార్థుల మానసిక ఉల్లాసం, శారీరక ఆరోగ్యం, సృజనాత్మకత మరియు సమగ్ర వికాసాన్ని దృష్టిలో ఉంచుకుని గౌరవ మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ ఆలోచనల మేరకు ప్రతి శనివారం "నో బ్యాగ్ డే" నిర్వహించే విధంగా విద్యాశాఖ అకాడమిక్ క్యాలెండర్‌లో ప్రత్యేకంగా చోటు కల్పించడం విశేషం. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడా పోటీలు, సృజనాత్మక కార్యక్రమాలు మరియు వినోదాత్మక విద్యా కార్యకలాపాలలో విద్యార్థులు ఉల్లాసంగా పాల్గొన్నారు. క్రికెట్, వాలీబాల్, కోకో, కబడ్డీ, చదరంగం వంటి క్రీడల ద్వారా విద్యార్థులలో జట్టు భావన, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ మరియు ఆత్మవిశ్వాసం పెంపొందుతున్నాయని పాఠశాల ఇన్‌చార్జ్ ఉర్దూ ఉపాధ్యాయులు మహమ్మద్ ఇర్ఫాన్ పాషా తెలిపారు. ప్రాథమిక దశలోనే పిల్లలలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడానికి, సృజనాత్మకతను వెలికితీయడానికి మరియు ఆనందదాయకమైన అభ్యాస వాతావరణాన్ని కల్పించడానికి నో బ్యాగ్ డే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కిండర్ గార్డెన్ మరియు మాంటిసోరి విధానాల్లో అమలు చేస్తున్నట్లుగా ఆటలు, పాటలు మరియు కార్యకలాపాల ఆధారిత బోధన విద్యార్థుల సమగ్ర వికాసానికి దోహదపడుతుందని వివరించారు.

# రొట్టెల పండుగ భక్తుల రద్దీకి భారీ ఏర్పాట్లు

**రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ**

**పటిష్ట భద్రత నిఘా కోసం నాలుగు డ్రోన్లను ఆవిష్కరించిన మంత్రి నారాయణ**

**లంగర్ ఖానా ప్రారంభించిన మంత్రి**

**అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, జిల్లా ఎస్పీ అజిత, మున్సిపల్ కమిషనర్ నందన్ తో కలిసి ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి**






**నెల్లూరు, జూన్ 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రొట్టెల పండుగ రెండో రోజు సందర్భంగా బారాషహీద్ దర్గాలో చేపట్టిన ఏర్పాట్లను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ శనివారం పరిశీలించారు. పోలీస్ కమాండ్ కంట్రోల్ నుంచి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, జిల్లా ఎస్పీ అజిత, మేయర్ సుజాత, మున్సిపల్ కమిషనర్ నందన్ తదితరులతో కలిసి భక్తుల భద్రత, నిఘా కోసం ఏర్పాటు చేసిన నాలుగు అత్యాధునిక డ్రోన్లను మంత్రి ప్రారంభించారు. అనంతరం లంగర్ ఖానాను ప్రారంభించి భక్తులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, రొట్టెల పండుగ తొలిరోజు దాదాపు 3 లక్షల మంది భక్తులు దర్గాను సందర్శించగా, రెండో రోజు 4 నుంచి 5 లక్షల మంది వరకు, ప్రధాన ఘట్టం జరిగే ఆదివారం 6 నుంచి 7 లక్షల మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈరోజు అర్ధరాత్రి గంధ మహోత్సవం, రేపు రొట్టెల పండుగ ప్రధాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ నాలుగు అత్యాధునిక డ్రోన్లను వినియోగంలోకి తీసుకువచ్చామని, రాత్రి వేళల్లో కూడా స్పష్టమైన దృశ్యాలను అందించే ఈ డ్రోన్ల ద్వారా ఏరియల్ సర్వైలెన్స్ నిర్వహిస్తున్నామని చెప్పారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సీసీటీవీ కెమెరాల ద్వారా దర్గా పరిసరాలు, ఘాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. భక్తులందరూ సంతృప్తి చెందేలా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రొట్టెల పండుగను రాష్ట్ర పండుగగా గుర్తించిన తర్వాత గతంలో రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని గుర్తుచేసిన మంత్రి, ఈసారి ప్రభుత్వం మరో రూ.5 కోట్లు కేటాయించిందన్నారు. మున్సిపల్ కార్పొరేషన్, వక్ఫ్ బోర్డు నిధులతో కలిపి రూ.10 కోట్ల వ్యయంతో భారీ ప్రార్థనా మందిరం నిర్మిస్తున్నామని, వచ్చే రొట్టెల పండుగ నాటికి అది అందుబాటులోకి వస్తుందని తెలిపారు. అలాగే కసుమూరు దర్గా సహా ఇతర ఆధ్యాత్మిక కేంద్రాలను అనుసంధానిస్తూ ప్రత్యేక టూరిజం సర్క్యూట్ ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, గత రెండు రోజులుగా జరుగుతున్న రొట్టెల పండుగలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేశామని తెలిపారు. చైన్ స్నాచింగ్, పిక్‌పాకెటింగ్, మిస్సింగ్ కేసులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామని చెప్పారు. 12 నుంచి 14 సంవత్సరాల లోపు పిల్లలకు సమాచార ట్యాగ్‌లు అందజేస్తున్నామని, వాటిలో తల్లిదండ్రుల వివరాలు నమోదు చేస్తున్నామని తెలిపారు. ఈ సాంకేతికత ద్వారా శనివారం మధ్యాహ్నం వరకు తప్పిపోయిన సుమారు 45 మంది పిల్లలను గుర్తించి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించినట్లు వెల్లడించారు. దర్గా పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, త్రాగునీరు, అన్నదానం, వైద్య సేవలు సహా అన్ని వసతులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. భక్తులు వాహనాల్లో ఓవర్‌లోడ్ ప్రయాణాలు చేయకుండా, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ అధికారులకు సహకరించాలని కోరారు. ఈ నెల 30వ తేదీ వరకు రొట్టెల పండుగ కొనసాగనున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అబ్దుల్ అజీజ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు దీక్ష, సౌజన్య, పోలీస్, కార్పొరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అనంత యువకుడికి లండన్ లో అరుదైన గౌరవం

## గొర్తి ఉదయ్ కిరణ్ కు బ్రిటన్ పార్లమెంట్ లో ఘనసత్కారం





**అనంతపురము,జూన్ 27 (వార్తాప్రభ) :** నగరానికి చెందిన యువ పరిశోధకుడు, సామాజిక అధ్యయనశీలి గొర్తి ఉదయ్ కిరణ్ కు లండన్ లో అరుదైన గౌరవం దక్కింది. ఈ వేడుకలో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (లండన్) సంస్థ సిఈఓ సంతోష్ శుక్లా, రాజేష్ శుక్ల, బ్రిటన్ పార్లమెంటు సభ్యులు గరేత్ బకాన్, వీరేంద్ర శర్మ, మిస్ ఇంగ్లాండ్ లిమిటెడ్ డైరెక్టర్ యాంజీ బిస్లె తదితరులు అవార్డును అందజేశారు. "గ్రామీణ యువతపై సోషల్ మీడియా ప్రభావం : ఒక అధ్యయనం" అనే అంశంపై ఆయన సమర్పించిన పరిశోధనా పత్రానికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. లండన్ నగరంలోని బ్రిటన్ పార్లమెంట్ సభా మందిరంలో ఉదయ్ కిరణ్ ను ఘనంగా సత్కరించారు. ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ నల్లాని రాజేశ్వరి, ప్రభుత్వ హెడ్మాష్టర్ గొర్తి వెంకటస్వామి దంపతుల కుమారుడైన ఉదయ్ కిరణ్ ను ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ప్రత్యేకంగా అభినందించారు. తిరుపతి లోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎం.ఏ., సోషియాలజీ పూర్తి చేసిన ఉదయ్ కిరణ్ ప్రస్తుతం పోటీపరీక్షలకు సిద్ధమవుతున్నారు. అనంతపురం రామ్ నగర్ లోని ఉదయ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఐదవ తరగతి వరకు ప్రాథమికవిద్య నభ్యసించారు. ఇక్కడ జాతీయ రహదారి లోని శ్రీ చైతన్య పాఠశాలలో 6, 7 తరగతులు పూర్తి చేశారు. బెంగళూరు వద్ద ఆకాష్ ఇంటర్నేషనల్ స్కూల్లో 9 నుంచి 12 వ తరగతి వరకూ సిబిఎస్ఈ సిలబస్ లో మంచి ఫలితాలు సాధించారు. హైదరాబాద్ లోని ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ చదువుతూ, కెపి 21 వ సెంచరీ ఐఏఎస్ అకాడమీలో యూపీఎస్సీ పరీక్షలకు ప్రాథమిక శిక్షణ పొందారు. బి.ఏ., (ఈపిపి) పూర్తిచేశాక, ఢిల్లీలోని ప్రముఖ శిక్షణా సంస్థ నుంచి ఆన్లైన్ ద్వారా తర్ఫీదు పొందుతున్నారు. అంతర్జాతీయంగా సింగపూర్, దుబాయ్, బ్రిటన్ వంటి దేశాలను సందర్శించారు. దేశంలో ప్రసిద్ధి పొందిన విద్యావేత్తలు, సామాజికవేత్తలను వ్యక్తిగతంగా కలిసి పలు అంశాలపై చర్చించి మంచి అవగాహనను పెంచుకున్నారు. ప్రముఖ స్వచ్ఛంద సంస్థలు రాస్, పాస్, ఆర్.డి.టి. ల కార్యక్రమాలను ప్రత్యేకంగా పరిశీలించారు. వారు నిర్వహిస్తున్న అనాథల, అంధుల, వృద్ధుల ఆశ్రమాలను తరచూ సందర్శించారు. ఎస్వీ యూనివర్సిటీలో ఎం.ఏ., (సోషియాలజీ) చదివే కాలంలో ప్రాజెక్టు వర్క్ గా చేసిన అంశం మీద ఆసక్తితో మరింత లోతుగా అధ్యయనం సాగించారు. రాయలసీమ జిల్లాల్లోని పలు గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి, అక్కడి యువత మీద సామాజిక మాధ్యమాల ప్రభావం గురించి ప్రత్యేక అధ్యయనం చేశారు. నగరాలతో పాటు గ్రామాలను కూడా సోషల్ మీడియా బాగా ఆకర్షించినట్లు గమనించారు. మాదక ద్రవ్యాల నియంత్రణ, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలపై కూడా ప్రత్యేక అధ్యాయాల్లో లోతుగా చర్చించారు. ఫలితాలను శాస్త్రీయంగా అధ్యయనం చేసిన ఉదయ్ కిరణ్ తనదైన శైలిలో విశ్లేషించారు. మెంటార్ చంద్రశేఖర్, తల్లిదండ్రులు, గురువుల ప్రోత్సాహంతో తన పరిశోధనా పత్రాలను "వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్" (లండన్) వారి దృష్టికి తీసుకెళ్లారు. సామాజిక అంశాల పట్ల ఇతనికున్న ఆసక్తి, అవగాహనను గుర్తించిన ఆ సంస్థ సిఈఓ సంతోష్ శుక్లా ప్రత్యేకంగా లండన్ కు ఆహ్వానించారు. సాక్షాత్తూ బ్రిటన్ పార్లమెంట్ లోని సభామందిరంలో ఘనంగా సత్కరించారు. అక్కడి పార్లమెంట్ సభ్యుల డైనింగ్ హాల్ లోనే బ్రిటిష్ అధికారులు, ఎంపి లతో కలిసి గౌరవంగా విందును కూడా ఏర్పాటు చేశారు. బ్రిటన్ పార్లమెంట్ ను సందర్శించే అరుదైన అవకాశం తనకు రావడం పట్ల సామాజిక పరిశోధక విద్యార్థి గొర్తి ఉదయ్ కిరణ్ ఆనందం వ్యక్తం చేశారు. భారతదేశంలో గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన, సామాజిక సాధికారత కోసం భవిష్యత్తులో తన వంతు కృషి సాగిస్తానని ఉదయ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**ఇది గొప్ప మైలురాయి : సిఈఓ..**రల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ తన 10వ సమ్మిట్ – అంతర్జాతీయ అవార్డుల ప్రదానోత్సవం యూకే పార్లమెంట్లోని ప్రతిష్టాత్మకమైన హౌస్ ఆఫ్ కామన్స్, ప్యాలెస్ ఆఫ్ వెస్ట్మిన్స్టర్లో ఘనంగా జరిగిందని అధికారికంగా ప్రకటించింది. ఈ వేడుక సంస్థ చరిత్రలోనే అత్యంత ముఖ్యమైన సమావేశాలలో ఒకటిగా నిలవనుంది. ఈ విశిష్టమైన వేడుక, యూకే (యునైటెడ్ కింగ్డమ్), యూఎస్ఏ (యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా), రష్యా, ఫ్రాన్స్, ఇటలీ, ఇండియా, నేపాల్, కజకిస్తాన్, కెనడా, మెక్సికో, పోర్చుగల్, స్పెయిన్, స్విట్జర్లాండ్, బెల్జియం, జర్మనీ, ఈజిప్ట్, స్వీడన్, నార్వే, ఫిన్లాండ్, పోలాండ్, జపాన్, ఆస్ట్రేలియా, మారిషస్ దేశాల నుండి వచ్చిన అత్యుత్తమ వ్యక్తులు, సంస్థలను సత్కరించే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, ప్రజా సేవ, దౌత్యం, వ్యాపార రంగాలలో రాణించిన వారిని కీర్తించింది. ఈ వేడుకలో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (లండన్) సంస్థ సిఈఓ సంతోష్ శుక్లా, రాజేష్ శుక్ల, బ్రిటన్ పార్లమెంటు సభ్యులు గరేత్ బకాన్, వీరేంద్ర శర్మ, మిస్ ఇంగ్లాండ్ లిమిటెడ్ డైరెక్టర్ యాంజీ బిస్లె తదితరులు అవార్డును అందజేశారు. ప్రపంచ ప్రముఖులు, క్యాబినెట్ మంత్రులు, దౌత్యవేత్తలు, విధాన రూపకర్తలు, అంతర్జాతీయ వ్యాపార నాయకులు వంటి ఉన్నత స్థాయి ప్రతినిధులు హాజరయ్యారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ప్రాముఖ్యతను సంతరించుకుంది. విభిన్న దేశాలు, రంగాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటున్న ఈ వేడుక, అర్థవంతమైన చర్చలను ప్రోత్సహించి, అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేస్తుందని నిర్వాహకులు ఆశిస్తున్నారు. ప్రపంచ ఐక్యత, గుర్తింపు, పురోగతిని ప్రోత్సహించడంలో ఈ వేడుకల ప్రాముఖ్యతను నొక్కిచెబుతూ, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సీఈఓ సంతోష్ శుక్లా సభలో ప్రకటన చేశారు. ఈ వేడుక శ్రేష్ఠతను గౌరవించడమే కాకుండా, ప్రపంచ పరివర్తన దిశగా సామూహిక బాధ్యతను ప్రేరేపిస్తుందని ఆయన పేర్కొన్నారు. దాని అంతర్జాతీయ ప్రభావం, ఉన్నత స్థాయి భాగస్వామ్యంతో, 10వ సమ్మిట్ – అవార్డుల ప్రదానోత్సవం యూకే పార్లమెంట్ నడిబొడ్డున ఒక మైలురాయి సమావేశంగా నిలుస్తుందని వాగ్దానం చేశారు.

## కులాలు చూడొద్దు... అభివృద్ధి చూడండి... ఎన్డీఏకు సహకరించండి


(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు పట్టుదలతో పని చేస్తున్నారు. వచ్చే ఏడాది నాటికి ఫేజ్ 2 కూడా పూర్తి చేస్తాం. తుంగభద్ర డ్యాంకు గేట్లు పెట్టేందుకు సహకరించాం... సీజన్ కాపాడాం. ముగ్గురు సీఎంలు, కేంద్ర మంత్రి కలిసి కొత్త గేట్లను ప్రారంభించాం. జల వివాదాలకు స్వస్తి పలకాలని నిర్ణయించాం... గంగా–కావేరి నదుల అనుసంధానం జరగాలి. పోలవరం ప్రాజెక్టులు పూర్తి అయితే.. గోదావరి, కృష్ణా, తుంగభద్ర, వంశధార, పెన్నా, కావేరి నదులు అనుసంధానం అయ్యేందుకు అవకాశం ఉంది. నదుల అనుసంధానంతో పాటు భూగర్భ జలాలు పెంచాలి.. అందుకే జలధార కార్యక్రమం చేపట్టాం. భూగర్భ జలాలు పెరిగితే.. విద్యుత్ భారం తగ్గుతుంది."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**గొడ్డలి పార్టీకి ప్రజలే బుద్ధి చెప్పాలి..** "గత పాలకుల నిర్వాకం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి... రాష్ట్రం విధ్వంసమైంది. శాంతి భద్రతలకు తీవ్రమైన విఘాతం కలిగించేలా వ్యవస్థలను నిర్వీర్యం చేశారు. పరిశ్రమలను తరిమేశారు.. పెట్టుబడులు రాకుండా అడ్డుకున్నారు... అప్పుల భారాన్ని పెంచారు. గడచిన ప్రభుత్వం వెలిగొండ పనులు చేపట్టి ఉంటే నీళ్లు ఎప్పుడో వచ్చేవి. కూటమి ప్రభుత్వం వచ్చాకే పెద్ద ఎత్తున పనులు చేపట్టాం. గత పాలకులు వెలిగొండ ప్రాజెక్టు విషయంలో డ్రామాలాడారు.. మోసం చేశారు. మోసం చేయడంలో గొడ్డలి పార్టీ దిట్ట.. కళ్లార్పకుండా అబద్దాలు చెబుతారు... తేరుకునేలోపే మోసం చేసేస్తారు. మోసాలు ఎలా చేస్తారో.. ప్రజలను ఏ విధంగా ఏమారుస్తారోననే విషయంపై అవగాహన కల్పించేందుకు గొడ్డలి పార్టీ చర్యలను వివరిస్తూ మ్యూజియంలో పెట్టాలి. గొడ్డలి పార్టీకి బుద్ధి చెప్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైనా ఉంది. వెలిగొండ ప్రాజెక్టుకు గత ప్రభుత్వం కేవలం రూ.980 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టింది. కూటమి ప్రభుత్వం నిర్వాసితులకే రూ. 900 కోట్లు ఖర్చు పెడుతోంది... నిర్మాణానికి రూ. 3 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తోంది. నిర్వాసితులకు గత ప్రభుత్వం పరిహారం ఇవ్వలేదు.. సొరంగాల్లో తవ్విన మట్టిని కూడా తీయలేదు.. ఫీడర్ కెనాల్ పనులను చేపట్టలేదు. ఇరుక్కుపోయిన టన్నెల్ బోరింగ్ యంత్రాన్ని తీయకుండానే జాతికి అంకితం అని మోసం చేశారు. 2014–19 మధ్య కాలంలోనే సొరంగాల పనులు చాలా వరకు పూర్తి చేశాం. వెలిగొండ ప్రాజెక్టు పరిధిలో 7,225 మంది నిర్వాసితులు ఉన్నారు... ప్రతి ఒక్కరి వెనుకా ఓ విషాద గాథ ఉంటుంది. పుట్టిన ఊరు నుంచి వెళ్లిపోవాలంటే చాలా బాధేస్తుంది. ఇంత మంది నిర్వాసితులుంటే... గత ప్రభుత్వం కేవలం 96 మందికి మాత్రమే పునరావాసం ఇచ్చింది. నిర్వాసితుల గోడు వెళ్లబోసుకోవాలని వస్తే కేసులు పెట్టించారు. కానీ మాది ప్రజా ప్రభుత్వం.. ఏ ఒక్కరూ నష్టపోకుండా వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేస్తాం.. ఇది నా గ్యారెంటీ. గత ప్రభుత్వం వదిలి పెట్టిన రూ.140 కోట్ల పెండింగ్ బిల్లులను కూడా చెల్లించాం. ఏ పార్టీ అధికారంలోకి వస్తే మాకేం అవుతుందనే భావనతో ఉండొద్దు.. ప్రజల జీవితాలను విధ్వంసం చేయవచ్చని గత పాలకులు నిరూపించారు. పోలవరం ప్రాజెక్టులో డయా ఫ్రం వాల్ పడగొట్టేలా చేశారు. ప్రభుత్వాన్ని నమ్మి అమరావతికి రైతులు భూములిస్తే.. దాన్ని నిర్వీర్యం చేశారు... రాజధాని లేకుండా చేశారు... మూడు ముక్కలాట ఆడారు. అమరావతిని రాజధానిగా కేంద్రం చట్టం చేస్తే... మావిగన్ అంటున్నారు. రాజధానితో మాకేం పని ఇతర ప్రాంతాల వాళ్లు అనుకోవద్దు... రాజధాని లేని రాష్ట్రంగా ఉండడం మంచిదా అని ప్రజలు ఆలోచించాలి.

## 2025 ఎంప్లాయిస్ యాక్ట్ అమలులో ఎస్సీ ఎస్టీ ఉద్యోగులకు ప్రాధాన్యత కల్పించాలి

- అపాయింట్మెంట్ తేదీని ప్రాతిపదికగా తీసుకోవాలి
- ఏపీ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సామల సింహాచలం



**విజయవాడ,జూన్ 27 (వార్తాప్రభ) :** 2025 ఎంప్లాయిస్ యాక్ట్ ప్రకారం ఉపాధ్యాయ, ఉద్యోగులను జిల్లాలకు కేటాయించే విధానంలో ఎస్సీ ఎస్టీ ఉద్యోగులకు సరైన ప్రాధాన్యత కల్పించాలని ఏపీ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, ఎంఈఓ 1 అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 ఏపీ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ ఉత్తర్వుల ప్రకారం అన్ని శాఖలకు చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అధికారులను జిల్లాలకు కేటాయించే ప్రక్రియలో కేడర్ సీనియారిటీ కాకుండా అపాయింట్మెంట్ సీనియార్టీని ప్రాతిపదికగా కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. అలాకాకుండా ప్రస్తుతం పని చేస్తున్న క్యాడర్ ప్రాతిపదికన ఉద్యోగ విభజన జరిగితే సీనియర్లకు నష్టం జరిగే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ప్రత్యేక చొరవ తీసుకొని న్యాయం చేయాలని సామల విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా యుసియుకె కాలేజి గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



**కాకినాడ,జూన్ 27 (వార్తాప్రభ) :** జవహర్లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ కాకినాడ (జేఎన్టీయూకే) పరిధిలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, కాకినాడ (యూసీఈకే) లో గ్రాడ్యుయేషన్ డే–2026 కార్యక్రమం శనివారం జెఎన్టియుకె అలుమ్ని ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, యూసీఈకే ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. పద్మ రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా యూసీఈకే ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.పద్మ రాజు 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన కళాశాల అకాడెమిక్ నివేదికను సభలో సమర్పించారు. కళాశాల విద్యా ప్రగతి, పరిశోధన, ప్లేస్మెంట్లు, జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయి విజయాలు, విద్యార్థుల ప్రతిభ, అధ్యాపకుల పరిశోధన కార్యక్రమాలు, మౌలిక వసతుల అభివృద్ధి, పరిశ్రమలతో భాగస్వామ్యాలు, ఇన్నోవేషన్ మరియు స్టార్టప్ కార్యక్రమాలపై నివేదికలో సమగ్రంగా వివరించారు. యూసీఈకే విద్యార్థులు విద్యా ప్రమాణాలు, నైపుణ్యాభివృద్ధి మరియు ఉపాధి అవకాశాల పరంగా విశిష్ట విజయాలు సాధిస్తూ విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకువస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సి. ఎస్. ఆర్.కె. ప్రసాద్ మాట్లాడుతూ, "గ్రాడ్యుయేషన్ అనేది విద్యార్థి జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయి. ఇది విద్యా ప్రయాణానికి ముగింపు కాదు, సమాజ సేవకు, వృత్తి జీవితానికి, నిరంతర అభ్యాసానికి నాంది. నేటి ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న నేపథ్యంలో విద్యార్థులు జీవితాంతం నేర్చుకునే మనస్తత్వాన్ని అలవంర్చుకోవాలి. ఇంజినీర్లుగా మీపై సమాజానికి, దేశానికి ఉన్న బాధ్యతను గుర్తించి, మీ జ్ఞానం, నైపుణ్యాలను ప్రజల సంక్షేమానికి వినియోగించాలి." అని అన్నారు."సాంకేతిక నైపుణ్యాలతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, నిజాయితీ, నాయకత్వ లక్షణాలు ప్రతి విద్యార్థికి ఎంతో అవసరం. ఉద్యోగ అవకాశాల కోసం మాత్రమే కాకుండా, ఉద్యోగాలను సృష్టించే పారిశ్రామికవేత్తలుగా, ఆవిష్కర్తలుగా ఎదగాలి. పరిశోధన, ఆవిష్కరణలు, స్టార్టప్లు, కృత్రిమ మేధస్సు, సుస్థిర అభివృద్ధి వంటి రంగాల్లో యువత ముందుండి దేశ అభివృద్ధికి తోడ్పడాలి." అని సూచించారు. "జేఎన్టీయూకే విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా తమ ప్రతిభను చాటుకుంటూ విశ్వవిద్యాలయానికి విశిష్ట గుర్తింపు తీసుకువస్తున్నారు. నేడు పట్టభద్రులుగా బయటకు వెళ్తున్న ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులు, అధ్యాపకులు, విశ్వవిద్యాలయం గర్వపడేలా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాను. మీరు ఎక్కడ ఉన్నా జేఎన్టీయూకేతో అనుబంధాన్ని కొనసాగిస్తూ, మీ అనుభవాన్ని తదుపరి తరాలకు పంచుకోవాలని కోరుతున్నాను. పట్టభద్రులందరికి అభినందనలు, ఉజ్వల భవిష్యత్తు కోసం శుభాకాంక్షలు." అని ఉపకులపతి పేర్కొన్నారు.అనంతరం 2025--26 విద్యా సంవత్సరంలో పట్టభద్రులైన 216 మంది విద్యార్థులు ఉపకులపతి ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. పద్మ రాజు చేతుల మీదుగా డిగ్రీ సర్టిఫికెట్లను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అకాడెమిక్స్ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. వి. ఎస్. ఆర్. దీక్షితులు, అడ్మినిస్ట్రేషన్ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.స్వరూప రాణి, విభాగాధిపతులు, అధ్యాపకులు, పట్టభద్రులు, వారి తల్లిదండ్రులు మరియు పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఈ నెల 28న పల్స్ పోలియో కార్యక్రమం


- ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు
- జిల్లాలో 1.69 లక్షల మంది చిన్నారులకు లక్ష్యం
- 966 కేంద్రాల్లో పల్స్ పోలియో కార్యక్రమం
- పల్స్ పోలియో ర్యాలీని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ,జూన్ 27 (వార్తాప్రభ) :** జూన్ 28న నిర్వహించనున్న "పోలియో ఆదివారం" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శనివారం నగరంలోని ఓల్డ్ జీజీహెచ్ వద్ద నిర్వహించిన పల్స్ పోలియో అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పుట్టినప్పటి నుంచి ఐదేళ్లలోపు ఉన్న ప్రతి చిన్నారికి జూన్ 28న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో తప్పనిసరిగా రెండు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోలేని పిల్లలకు సోమవారం, మంగళవారం వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చుక్కలు వేస్తారని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 1,69,810 మంది ఐదేళ్లలోపు చిన్నారులను లక్ష్యంగా తీసుకుని 966 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లోని 23 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లోని 47 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. సోమవారం, మంగళవారం రోజుల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు జిల్లాలోని 6,71,409 గృహాలను సందర్శించి, ఏ ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా పోలియో చుక్కలు వేయించి ఇంటింటికీ మార్కింగ్ నిర్వహిస్తారని వివరించారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు వంటి రద్దీ ప్రాంతాల్లో 35 ట్రాన్సిట్ పాయింట్లను ఏర్పాటు చేయడంతో పాటు 34 మొబైల్ బృందాలను ప్రత్యేకంగా నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు 4,274 మంది వ్యాక్సినేటర్లు, 104 మంది రూట్ సూపర్వైజర్లు విధులు నిర్వర్తించనున్నారని, మొత్తం 3.10 లక్షల పోలియో డోసులను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. అన్ని శాఖల సమన్వయంతో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఆర్డీవో వెన్నెల శ్రీను, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ సీహెచ్ఎంఓ డా. అర్జునరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఇందుమతి దేవి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. ఎం.శరత్ బాబు, డా. నవీన్, డా. సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర ఓటరు జాబితాకు సర్ కసరత్తు

- క్షేత్రస్థాయిలో ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ
- పారదర్శకతకు పెద్దపీట వేస్తూ అధికారులకు దిశానిర్దేశం



**విజయవాడ,జూన్ 27 (వార్తాప్రభ) :** ఓటరు జాబితాల కచ్చితత్వం ఎన్నికల ప్రక్రియకు అత్యంత కీలకమని, అర్హులైన ఏ ఒక్క ఓటరూ జాబితా బయట లేకుండా.. అనర్హులెవరూ జాబితాలో లేకుండా దోషరహిత, సమగ్ర ఓటరు జాబితా రూపకల్పనకు సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) జరుగుతోందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ లక్ష్మీశ శనివారం విజయవాడ అర్బన్ పరిధిలో విజయవాడ తూర్పు, మధ్య, పశ్చిమ నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించారు. క్షేత్రస్థాయిలో బీఎల్వోల ద్వారా ఎన్యూమరేషన్ ఫారాల (ఈఎఫ్) పంపిణీ, స్వీకరణ, డిజిటైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ నియోజకవర్గాల్లో సర్ ఇంటింటి సర్వే పకడ్బందీగా జరుగుతోందని.. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలో 14,99,852 (87.53 శాతం) ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ జరిగిందని, అదేవిధంగా 1,84,411 ఫారాల డిజిటైజేషన్ పూర్తయిందన్నారు. ఈ నేపథ్యంలో త్వరితగతిన ఫారాల పంపిణీని పూర్తిచేయడంతో పాటు డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. తిరువూరులో 1,96,351 (94.08 శాతం), విజయవాడ పశ్చిమ 2,04,853 (79.72 శాతం), విజయవాడ సెంట్రల్ 2,30,320 (82.9 శాతం), విజయవాడ తూర్పు 2,27,376 (84.3 శాతం), మైలవరం 2,49,135 (87.36 శాతం), నందిగామ 1,94,997 (93.98 శాతం), జగ్గయ్యపేట 1,96,820 (94.83 శాతం) మేర ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసినట్లు వివరించారు. బీఎల్వోలు, అధికారులు ఈసీఐ నియమనిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించాలని, ఎలాంటి ప్రభావాలకు తావులేకుండా నిష్పక్షపాతంగా నిబద్ధతతో సర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేయడంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కలెక్టర్ వెంట విజయవాడ ఆర్డీవో వెన్నెల శ్రీను తదితరులు ఉన్నారు.

## తల్లి జ్ఞాపకార్థం డైనింగ్ టేబుల్ సెట్ అందించిన రాయపూడి వేణుగోపాల్ రావు.



**అవనిగడ్డ,జూన్ 27 (వార్తాప్రభ) :** అవనిగడ్డ లోని మానసిక దివ్యాంగుల పాఠశాలకు ప్రముఖ న్యాయవాది,జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణా జిల్లా మాస్టర్ ట్రైనర్ రాయపూడి వేణుగోపాల్ రావు తన తల్లి జ్ఞాపకార్థం దివ్యాంగ విద్యార్థుల అవసరార్థం డైనింగ్ టేబుల్ సెట్ సమకూర్చారు.పాఠశాలను సందర్శించిన సందర్భంలో విద్యార్థులు క్రింద కూర్చొని భోజనం చేసేందుకు ఇబ్బంది పడుతున్న విషయాన్ని గమనించిన రాయపూడి వేణుగోపాల్ రావు తనవంతు సాయంగా తన తల్లి జ్ఞాపకార్థం డైనింగ్ టేబుల్ సెట్ అందించారు.సదరు పాఠశాలలో వివిధ ప్రాంతాలకు చెందిన 25 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు.మానసిక వికలాంగుల పాఠశాలలో మౌళిక సదుపాయాల ఏర్పాటుకు దాతలు తమవంతు సహకారం అందించాలని ఈ సందర్భంగా రాయపూడి వేణుగోపాల్ రావు విజ్ఞప్తి చేశారు.విద్యార్థుల అవసరాల కోసం తన తల్లి గారి జ్ఞాపకార్థం డైనింగ్ టేబుల్ సెట్ అందించిన రాయపూడి వేణుగోపాల్ రావు , కుటుంబ సభ్యులకు పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలియజేశారు.

## జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజులో రాయితీ పత్రం జారీ

**కాకినాడ,జూన్ 27 (వార్తాప్రభ) :** కాకినాడ జిల్లాలో పనిచేయుచున్న వర్కింగ్ జర్నలిస్టు పిల్లలకు 2026–27విద్యా సంవత్సరానికి సంబంధించి 50శాతం ఫీజు రాయితీ అవకాశం జిల్లా కలెక్టరు హరేంధిరప్రసాద్ కల్పించారని కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రెడ్డిపల్లి రాజేష్, కార్యదర్శి డెంకాడ మోహన్ తెలిపారు. ఫీజు రాయితీ కోరుతూ గత వారం జిల్లా కలెక్టరుకు కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్ తరుపున ప్రాతినిధ్యం వహిస్తు వినతిపత్రం అందజేసిన సంగతి తెలిసిందే.దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ,ప్రయివేటు విద్యా సంస్థలను జర్నలిస్టు పిల్లలకు ఫీజు రాయితీ తప్పనిసరిగా వర్తింపజేయాలని ఆదేశిస్తూ సంబంధించిన పత్రం జారీ చేశారని తెలిపారు.జిల్లాలోని జర్నలిస్టులశీదరు ఈ అవకాశం వినియోగించుకోవాలని సూచించారు.

## యు.టీ.ఎఫ్. రాష్ట్ర సంఘం ద్వారా టెట్ 1ఎ మెటీరియల్ పంపిణీ



**పెనుగంచిప్రోలు, జూన్ 27 (వార్తాప్రభ) :** ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పెనుగంచిప్రోలు మండల శాఖ సెకండ్ ది గ్రేట్ ఉపాధ్యాయుల కొరకు యుటిఎఫ్ రాష్ట్ర సంఘం ద్వారా తయారు చేయబడిన టెట్ 1ఎ మెటీరియల్ ను పంపిణీ చేసింది. ఈ కార్యక్రమంలో సీనియర్ యుటిఎఫ్ నాయకులు దైద దానయ్య,రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పి.లీల, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నందం భారతి, చాగర్ల రామారావు జిల్లా కార్యదర్శి షేక్ ప్రైమర్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మిగులు సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం: ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు



**రౌతులపూడి,జూన్ 27 (వార్తాప్రభ) :** రౌతులపూడి మండలం ఏ మల్లవరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల,కళాశాల నందు 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఇంటర్ చదువు కోవాలను కునే ఎస్సీ ఎస్టీ విద్యార్థి విద్యార్థులకు మిగులు చీట్లు భర్తీ కొరకు భర్తీ కొరకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.విద్యార్థులు ఆధార్ తో పాటు తల్లి,తండ్రి ఆధార్ జిరాక్సులతో పాఠశాలలో సంప్రదించాలన్నారు

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188